STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 134 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 29 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

బిల్లును ఉమ్మడిగా వ్యతిరేకిస్తాం



పునర్విభజన బిల్లుపై ఇండియా కూటమి నిర్ణయం

విపక్ష భేటీ అనంతరం మల్లికార్జున ఖర్గే

నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపడిన మహిళా రిజర్వేషన్ఉరాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ఉమ్మడిగా వ్యతిరేకించాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో రెండు గంటల పాటు జరిగిన విపక్ష నేతల సమావేశంలో రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీ, కపిల్ సిబల్, మనోజ్ ఝా సహా పలువురు నేతలు పాల్గొన్నారు. డీఎంకే, ఆప్, బీజేడీ వంటి పార్టీలు ఈ భేటీకి దూరంగా ఉన్నాయి.



డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే మద్దతు

దక్షిణాది రాష్ట్రాల పోరాట విజయం

డీఎంకే అధినేత స్టాలిన్ ప్రకటన

4

ఎవరూ అడ్డుకోలేరు

- మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం
- 2029 ముందే కొత్త నియోజకవర్గాలు
- ప్రధాని నరేంద్ర మోదీ

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా లోక్‌సభ స్థానాలను 850కి పెంచే ప్రతిపాదనతో పాటు 2029 ఎన్నికలకు ముందే కొత్త నియోజకవర్గాల ఏర్పాటు, మూడు బిల్లుల ద్వారా ఎన్నికల వ్యవస్థలో మార్పులకు సన్నాహాలు చేస్తోంది.

4



రైతులకు త్వరగా ఇన్‌పుట్ సబ్సిడీ

ముఖ్యమంత్రి చంద్రబాబు



2

రెండు బిల్లులను ఏకాభిప్రాయంతో ఆమోదించాలి

- ఏపీ లోక్‌సభ సీట్లు 25 నుంచి 38కి పెంపు
- దక్షిణాది రాష్ట్రాల వాటా చెక్కుచెదరదు
- బిల్లులను వ్యతిరేకిస్తే మహిళలకు అన్యాయమే
- ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి

3



సత్వర న్యాయానికి లీగల్ ఏఐ స్టాక్

కేసుల వేగవంత పరిష్కారానికి ప్రభుత్వ సరికొత్త వ్యవస్థ

- నాలుగు స్తంభాల బలంతోనే భారత్ స్థిర ప్రయాణం
- జస్టిస్ మిశ్రా తీర్పే రాష్ట్రాన్ని అమరావతిని కాపాడింది
- జిల్లా కోర్టు, రాజమండ్రి బార్ వేడుకల్లో సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, నవంబర్ 28 (సమయం న్యూస్): న్యాయ వ్యవస్థలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి కేసుల నిర్వహణను మరింత వేగవంతం, సమర్థంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. లీగల్ గవర్నెన్స్, లిటిగేషన్ మేనేజ్‌మెంట్ కోసం త్వరలోనే 'లీగల్ ఏఐ స్టాక్'ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా కోర్టు 222 ఏళ్లు, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం రాజమహేంద్రవరంలోని మంజీరా మిగతా 2 లో

850 సీట్ల ప్రతిపాదన ప్రజాస్వామ్య హత్యే

543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్ ఇవ్వొచ్చు

కమిషన్ కూర్పుపై తీవ్ర అభ్యంతరం

డీఎంకే, టీడీపీ, జనసేన పునరాలోచించాలి 4

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



30న డీలిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టనున్న అమిత్ షా



వివరాలు 4వ పేజీలో

పోలవరానికి ఎన్‌డీఎస్‌ఏ బృందం

ప్రాజెక్టు భద్రతపై క్షేత్రస్థాయి పరిశీలన

స్పిల్‌వే, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనుల తనిఖీ

జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష



.. వివరాలు 2లో



విద్య, పర్యాటక పథకాలపై నీతి ఆయోగ్ సమీక్ష

సీఎస్ సాయి ప్రసాద్‌తో డా. జోరమ్ ఆనియా భేటీ 3



రోడ్డుపై గుంత కనిపిస్తే 'మనమిత్ర'కు పంపండి!

ప్రత్యేక సదుపాయం కల్పించిన ఆర్టీజీఎస్ 3

అమరావతి నిర్మాణాలకు ఎస్ఎఫ్‌టీకి రూ.29,340 ఖర్చా?

- ఐదు భవనాల వ్యయం రూ.15,317 కోట్లకు పెంపు
- ఖర్చులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- సోషల్ మీడియాలో మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపణలు

వివరాలు 3లో..



కీలక పారిశ్రామిక హబ్‌గా ఓర్వకల్లు

జై రాజ్ ఇస్పాత్ రెండో దశలో రూ.3,378 కోట్లు విస్తరణతో అదనంగా 934 మందికి ఉద్యోగాలు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 2



నక్సల్ రహిత ఏపీయే ప్రధాన లక్ష్యం

- డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



3

నేడే రెండో దశ పంచాయతీ ఎన్నికలు

- 27 జిల్లాల్లో 3,880 పంచాయతీల్లో పోలింగ్
- ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకు ఓటింగ్
- 83.52 లక్షల మందికి పైగా ఓటర్లు

.. వివరాలు 2లో





ఏకాభిప్రాయంతో ఆమోదించాలి

ఏపీ లోక్‌సభ సీట్లు 25 నుంచి 38కి పెంపు

దక్షిణాది రాష్ట్రాల వాటా చెక్కుచెదరదు

బిల్లులను వ్యతిరేకిస్తే మహిళలకు అన్యాయమే

ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి

అమరావతి, నవంబర్ 28 (సమయం న్యూస్) : కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులను అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో ఆమోదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో డీలిమిటేషన్‌తో పాటు మహిళా రిజర్వేషన్ల అమలు అనేది మహిళా సాధికారత దిశగా ఒక నిర్ణయాత్మక అడుగు అని ఆయన పేర్కొన్నారు. శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. గత తప్పిదాలను పునరావృతం చేయకుండా అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఈ బిల్లులకు మద్దతు పలకాలని కోరారు. ఈ బిల్లులను వ్యతిరేకించడం అంటే మహిళలకు జరిగే న్యాయాన్ని నిరాకరించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. 1986లోనే స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని చంద్రబాబు గుర్తుచేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు 60 శాతం సీట్లు మహిళలకే దక్కాయని తెలిపారు. మహిళా రిజర్వేషన్లకు మద్దతు తెలుపుతూ రాష్ట్ర అసెంబ్లీ ఇప్పటికే కేంద్రానికి తీర్మానాన్ని పంపిందని ఆయన వివరించారు.

లోక్‌సభ సీట్ల సంఖ్యను 50 శాతం పెంచడం వల్ల ప్రతి రాష్ట్రం వాటాకు రక్షణ లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాల వాటా చెక్కుచెదరకుండా ఉంటుందని, ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ సీట్లు 25 నుంచి 38కి పెరుగుతాయని తెలిపారు. 1971లో ఒక ఎంపీ 10 లక్షల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించేవారని, నేడు ఆ సంఖ్య దాదాపు 27 లక్షలకు చేరిందని చంద్రబాబు వివరించారు. సీట్ల పెరుగుదలతో అది సుమారు 18 లక్షలకు తగ్గి, ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కీలక పారిశ్రామిక హబ్‌గా ఓర్వకల్లు

జై రాజ్ ఇస్పాత్ రెండో దశలో రూ.3,378 కోట్లు

విస్తరణతో అదనంగా 934 మందికి ఉద్యోగాలు

డ్రోన్ సిటీగానూ వేగంగా అభివృద్ధి

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

కర్నూలు, నవంబర్ 28 (సమయం న్యూస్) : ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ దేశంలోనే కీలక పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జై రాజ్ ఇస్పాత్ పరిశ్రమతో ప్రారంభమైన పారిశ్రామిక అభివృద్ధి ప్రస్థానం ప్రస్తుతం వివిధ రంగాలకు చెందిన సంస్థల రాకతో మరింత విస్తరిస్తోందని ఆయన తెలిపారు. 2016లో కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో జై రాజ్ ఇస్పాత్ సంస్థకు భూములు కేటాయించగా, 2018 మేలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పరిశ్రమకు శంకుస్థాపన చేశారని లోకేష్ గుర్తుచేశారు. నాడు ఖాళీగా ఉన్న భూముల్లో నేడు ఆసియాలోనే తొలిసారిగా ఎండ్‌లెస్ కాస్టింగ్ అండ్ రోలింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో సమీకృత ఉక్కు పరిశ్రమ కార్యకలాపాలు కొనసాగిస్తోందన్నారు. సుమారు 430 ఎకరాల్లో రూ.2,100 కోట్లకు పైగా పెట్టుబడితో ఈ పరిశ్రమను ఏర్పాటు చేశారని, ప్రాంగణంలో మూడో వంతు భూమిని పచ్చదనానికి కేటాయించడంతో పాటు నీటి అవసరాల కోసం 45 ఎకరాల్లో వర్షపు నీటి నిల్వ జలాశయాన్ని నిర్మించినట్లు వివరించారు.

రెండో దశలో 934 మందికి ఉద్యోగాలు



జై రాజ్ ఇస్పాత్ రెండో దశలో మరో 600 ఎకరాల్లో రూ.3,378 కోట్ల పెట్టుబడితో కార్యకలాపాలను విస్తరించనుందని మంత్రి వెల్లడించారు. ఈ విస్తరణ ద్వారా అదనంగా 934 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిశ్రమలో పనిచేస్తున్న వారిలో 65 శాతం మంది స్థానికులే కావడం సంతోషకరమన్నారు. మేనేజర్‌గా పనిచేస్తున్న ఎన్. శ్రీనివాసు, ఇంజనీర్‌గా పనిచేస్తున్న డి. సింధూజ వంటి స్థానిక యువత సొంత ప్రాంతంలోనే ఉద్యోగాలు పొందుతున్నారని తెలిపారు.

పలు రంగాల్లో కొత్త పరిశ్రమలు

జై రాజ్ ఇస్పాత్ రాకతో ఓర్వకల్లులో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు ఇతర పారిశ్రామిక సంస్థలకు పరిచయమయ్యాయని లోకేష్ పేర్కొన్నారు. రిలయన్స్ సంస్థ కేవలం 12 నెలల్లోనే ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ పరిశ్రమను ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. జాక్సన్, అగస్త్య గ్రీన్ ఎనర్జీ వంటి సౌర విద్యుత్ పరికరాల తయారీ సంస్థలు కూడా పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. మరోవైపు ఓర్వకల్లు డ్రోన్ సిటీగా అభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, స్థానిక యువతకు ఉద్యోగావకాశాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. రాయలసీమను రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నారా లోకేష్ పిలుపునిచ్చారు.

సత్వర న్యాయానికి 'లీగల్ ఏఐ స్టాక్'

(మొదటి పేజీ తరువాయి..)

సరోవర్ ప్రీమియర్ హోటల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా 8.4 లక్షల కేసులను నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల తయారీతో పాటు చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలు, కేసుల రికార్డులన్నింటినీ ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడమే 'లీగల్ ఏఐ స్టాక్' ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ వేడుకలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ పి. నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావు, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. వారి సమక్షంలో వార్షికోత్సవ సావనీర్‌ను సీఎం ఆవిష్కరించారు. సీనియర్ న్యాయవాదులు, న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు.

ప్రత్యామ్నాయ మార్గాలతో సత్వర న్యాయం

ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థతో పాటు ప్రజాప్రతినిధుల వ్యవస్థ కూడా ప్రజల హక్కుల పరిరక్షణకే పనిచేస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రతి ఒక్కరికీ సకాలంలో న్యాయం అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం, ఆర్బిట్రేషన్ వంటి ప్రత్యామ్నాయ విధానాలను ప్రోత్సహించడం ద్వారా కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయవచ్చని సూచించారు. కోర్టుల్లో ప్రభుత్వం ప్రతివాదిగా ఉన్న కేసులను న్యాయస్థానాల సహకారంతో త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ప్రయోజనం కల్పించాలన్నదే తమ ఆలోచనని వెల్లడించారు. తాటి ఆకులపై తీర్పుల ప్రతులు రాసిన రోజుల నుంచి నేటి



కృత్రిమ మేధ యుగం వరకు న్యాయ వ్యవస్థ ఎంతో రూపాంతరం చెందిందని సీఎం అన్నారు. ప్రజా కోర్టుగా పేరొందిన సీతానగరం రచ్చబండ కోర్టు 1849లోనే అధికారిక గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. సుదీర్ఘకాలంగా ప్రజలకు న్యాయ సేవలు అందిస్తున్న తూర్పుగోదావరి జిల్లా కోర్టుకు, రాజమండ్రి బార్ అసోసియేషన్‌కు అభినందనలు తెలిపారు. ఇదే బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన జస్టిస్ కోకా సుబ్బారావు దేశ తొమ్మిదో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. బ్రిటీష్ పాలకులను ఎదిరించి నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు వంటి న్యాయవాదుల ధైర్యాన్ని, ఆదికవి నన్నయ్య, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి మహనీయుల చారిత్రక వైభవాన్ని, ఉభయగోదావరి డెల్టాను అన్నపూర్ణగా మార్చిన ఆర్థర్ కాటన్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

నాలుగు స్తంభాలే దేశానికి రక్ష

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు సంక్షోభాలతో సతమతమవుతున్నా భారత్ మాత్రం స్థిరంగా ముందుకు సాగుతోందని సీఎం చెప్పారు. ప్రజాస్వామ్యంలోని నాలుగు వ్యవస్థలు పటిష్ఠంగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యమని పునరుద్ఘాటించారు. పౌర పాలన, పన్నుల వసూళ్లలోనూ ఏఐ సాంకేతికతతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు. వచ్చే ఏడాది రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎంగా మూడోసారి గోదావరి పుష్కరాలు నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పుష్కరాలకు విచ్చేసి పుణ్య స్నానాలు ఆచరించాలని సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

అమరావతికి అండగా నిలిచిన తీర్పు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా గతంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పు రాష్ట్రాన్ని, అమరావతిని కాపాడిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ చరిత్రలో నిలిచిపోయారని అభినందించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు త్వరలో అమల్లోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రైతులకు త్వరగా ఇన్‌పుట్ సబ్సిడీ

- ఎన్డీఆర్ఎఫ్ నుంచి రూ.2,459 కోట్ల చెల్లింపునకు ప్రతిపాదనలు
- సబ్సిడీకి బీమా సాయం తోడైతేనే అన్నదాతకు మేలు
- ప్రకృతి సేద్యానికి 'జీ రామ్ జీ' నిధులు తెచ్చేలా కృషి
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, నవంబర్ 28 (సమయం న్యూస్) : ఒకవైపు కరువు, మరోవైపు తుపాన్ల బెడద ఉన్న రాష్ట్రంలో ప్రజలను ఆదుకోవడానికి స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విపత్తుల సమయంలో ఈ నిధుల ద్వారా బాధితులకు అండగా నిలిచి న్యాయం చేయాలని, అదే సమయంలో కేంద్రం నుంచి అదనపు నిధులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. శనివారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై నిర్వహించిన సమీక్షలో ఎల్ నినో కారణంగా ఏర్పడిన కరువు, అర్నబ్, మురసు తుపాన్లతో రైతులకు జరిగిన నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులపై ఆయన చర్చించారు. నష్టపోయిన రైతులకు సాధ్యమైనంత త్వరగా ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని సీఎం స్పష్టం చేశారు. ఎన్డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం కరువు, రెండు తుపాన్ల వల్ల వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక రంగాల్లో జరిగిన నష్టానికి గాను ఎస్డీఆర్ఎఫ్ నుంచి రూ.2,459 కోట్లు చెల్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా వివరించారు. ఇందులో ఒక్క వ్యవసాయ రంగానికే ఎల్ నినో కరువుకు రూ.1,721 కోట్లు, అర్నబ్ తుపానుకు రూ.602 కోట్లు, మురసు తుపానుకు రూ.97 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్ నిధుల నుంచి ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ప్రతి రైతుకూ బీమా సాయం అందేలా చూడాలని చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందుకు అవసరమైన వివరాలను పక్కాగా సేకరించి, నిధులను నేరుగా బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీకి బీమా సొమ్ము కూడా తోడైతేనే రైతులకు మేలు, న్యాయం జరుగుతాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో అందుబాటులో ఉన్న నిధులను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. హార్టికల్చర్‌కు 'జీ రామ్ జీ' నిధుల వినియోగానికి ఇప్పటికే ఆమోదం ఉందని గుర్తుచేస్తూ, ప్రకృతి సేద్యానికీ ఈ నిధులను వినియోగించుకునేలా అవసరమైన అనుమతులు సాధించాలని అధికారులను ఆదేశించారు.

నేడే రెండో దశ పంచాయతీ ఎన్నికలు

- 27 జిల్లాల్లో 3,880 పంచాయతీల్లో పోలింగ్
- ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకు ఓటింగ్
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- 83.52 లక్షల మందికి పైగా ఓటర్లు



అమరావతి, నవంబర్ 28 (సమయం న్యూస్): రాష్ట్రంలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు నేడు (ఆదివారం) జరగనున్నాయి. విశాఖ జిల్లా మినహా మిగిలిన 27 జిల్లాల్లోని 52 రెవెన్యూ డివిజన్లు, 246 మండలాల్లోని 3,880 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. నేడు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుండగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఇప్పటికే ఆయా కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ పూర్తయింది. రెండో దశలో మొత్తం 4,975 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, 1,170 పంచాయతీలు (23.52 శాతం సర్పంచ్ స్థానాలు) ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,803 సర్పంచ్ స్థానాలకు 10,295 మంది, 29,603 వార్డు సభ్యుల స్థానాలకు 63,395 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

37 వేల పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

రెండో దశ ఎన్నికల కోసం రాష్ట్రవ్యాప్తంగా 37,019 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఏకగ్రీవాలు, రేషనలైజేషన్ కారణంగా పోలింగ్ బూత్‌ల సంఖ్య దాదాపు 13 వేల వరకు తగ్గింది. పోలింగ్ పర్యవేక్షణ కోసం 8,470 చోట్ల వీడియో కెమెరాలు, 5,186 చోట్ల వెబ్‌కాస్టింగ్ అందుబాటులో ఉంచారు. ఈ విడతలో 83.52 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 42.46 లక్షల మందికి పైగా, పురుష ఓటర్లు 41.05 లక్షల మందికి పైగా ఉన్నారు. ఎన్నికల విధుల్లో 25 వేల మందికి పైగా పోలింగ్ సిబ్బంది, సుమారు 28 వేల మంది పోలీసు సిబ్బంది పాల్గొననున్నారు.

శ్రీకాకుళంలో అత్యధికం.. పల్నాడులో అత్యల్పం

జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 342 పంచాయతీల్లో పోలింగ్ జరుగుతోంది. ఇక్కడ 46 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. శ్రీకాకుళం జిల్లాలో 5.65 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తర్వాతి స్థానంలో తిరుపతి జిల్లాలో 237 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అత్యల్పంగా పల్నాడు జిల్లాలోని 54 పంచాయతీల్లో 1,39,479 మంది ఓటర్లు ఉన్నారు. కాగా, ఎన్టీఆర్ జిల్లాలో మొదటి విడత ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని, రెండో దశలో 138 పంచాయతీలకు గాను 11 ఏకగ్రీవం కావడంతో 127 పంచాయతీల్లో ఎన్నికలు జరుపుతున్నట్లు ఆ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సుమారు 3.30 లక్షల మంది ఓటర్లు ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

సౌకర్యాలు లేవని సిబ్బంది ఆందోళన

మరోవైపు, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి మండలంలో నేడు జరిగే ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది తమకు భోజనం, అల్పాహారం, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆందోళన చేపట్టారు. శనివారం సరుబుజ్జిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మెటీరియల్ పంపిణీ కేంద్రానికి ఉదయం 7.30 గంటలకు హాజరుకావాలని సమాచారం ఇచ్చినా అధికారులెవరూ రాలేదని సిబ్బంది ఆరోపించారు. ఉదయం 10.30 గంటలకు 350 మంది సిబ్బందికి కేవలం 30 నుంచి 40 మందికి సరిపోయే ఇడ్లీలు మాత్రమే తెచ్చారని, దీనిపై ఎంపీడీవో పావనిని ప్రశ్నించినట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కేంద్రం నుంచి బయటకు వచ్చి రోడ్డుపై ధర్నా నిర్వహించారు.

అమరావతి నిర్మాణాలకు ఎస్ఎఫ్‌టీకి రూ.29,340 ఖర్చా?

- ఐదు భవనాల వ్యయం రూ.15,317 కోట్లకు పెంపు
- మహానగరాల్లోనూ రూ.5 వేలు దాటడం లేదు
- ఖర్చులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- సోషల్ మీడియాలో మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపణలు



అమరావతి, నవంబర్ 28 (సమయం న్యూస్) : అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ వ్యయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.29,340 ఖర్చు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అంతర్జాతీయ స్థాయి నిర్మాణాల పేరుతో భారీగా ప్రజాధనం ఖర్చు చేస్తున్నారా, లేక అవినీతికి పాల్పడుతున్నారా అని నిలదీశారు.

రూ.2,271 కోట్ల నుంచి రూ.15,317 కోట్లకు!

2018లో కొత్త సచివాలయ భవనాల నిర్మాణ వ్యయాన్ని రూ.2,271 కోట్లుగా నిర్ణయించారని జగన్ పేర్కొన్నారు. 2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత టెండర్లను రద్దు చేసి, నిర్మాణ అంచనాలను భారీగా పెంచిందని ఆయన ఆరోపించారు. 2025 ఏప్రిల్‌లో మళ్లీ అవే కంపెనీలకు, అవే పనులను అప్పగించి కాంట్రాక్టు విలువను రూ.4,689 కోట్లకు పెంచారని, అనంతరం మరోసారి అంచనాలను సవరించి రూ.6,641 కోట్లకు చేర్చారని విమర్శించారు. దీనికి అదనంగా అద్దాలు, ఏసీలు, ఇతర అనుబంధ పనుల కోసం మరో రూ.4,830 కోట్లు కేటాయించినట్లు ఆరోపించారు. మొత్తంగా ఐదు భవనాలు, 52.20 లక్షల చదరపు అడుగుల నిర్మాణానికి రూ.15,317 కోట్లు ఖర్చవుతున్నాయని జగన్ వెల్లడించారు.

ఎస్ఎఫ్‌టీకి రూ.29,340 ఎలా?

ఒక్కో చదరపు అడుగు నిర్మాణానికి రూ.29,340 ఖర్చవుతోందని పేర్కొన్న జగన్, ఇంత భారీ వ్యయం ఎందుకని ప్రశ్నించారు. నిర్మాణాలకు ఇసుక ఉచితంగా అందించడం, విద్యుత్ ఛార్జీల్లో రాయితీలు, సీనరేజ్, ఎన్ఏసీ ఛార్జీల మినహాయింపులు కూడా ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి మహానగరాల్లో ఫైవ్‌స్టార్ సదుపాయాలతో కూడిన భవనాల నిర్మాణ వ్యయం కూడా చదరపు అడుగుకు రూ.5 వేలు దాటడం లేదని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు.

ప్రభుత్వం సమాధానం చెప్పాలి

ప్రజలపై అప్పుల భారం మోపుతూ, తమకు అనుకూలమైన వారికి భారీ కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని జగన్ ఆరోపించారు. అమరావతి నిర్మాణాల పేరుతో జరుగుతున్న ఖర్చులపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన జీవో కాపీల లింక్‌ను కూడా తన పోస్టులో జత చేశారు.

రోడ్డుపై గుంత కనిపిస్తే 'మనమిత్ర'కు పంపండి!

వాట్సాప్ నంబర్ 9552300009లో ఫిర్యాదుకు అవకాశం

ఫొటో, లొకేషన్ షేర్ చేస్తే వెంటనే మరమ్మతులు

ప్రత్యేక సదుపాయం కల్పించిన ఆర్టీజీఎస్



అమరావతి, నవంబర్ 28 (సమయం న్యూస్) : గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రహదారులపై ఎక్కడైనా గుంతలు కనిపిస్తే వెంటనే 'మనమిత్ర' ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించింది. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసే ఉద్దేశంతో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో ఈ సేవను అందుబాటులోకి తెచ్చింది. పౌరులు తమ ప్రాంతంలోని రోడ్లపై గుంతలు కనిపిస్తే మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు వివరాలు పంపాలని ప్రభుత్వం కోరింది. ముందుగా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009కు 'హాయ్' అని మెసేజ్ పంపాలి. అందులో 'సేవలు' ఆప్షన్‌ను ఎంచుకుని, 'పాట్‌హోల్ గ్రీవెన్సెస్'పై క్లిక్ చేయాలి. అనంతరం 'రిజిస్టర్ పాట్‌హోల్ గ్రీవెన్స్' ఆప్షన్‌ను ఎంపిక చేసుకోగానే, 'ప్లీజ్ ఫిల్ ది ఫామ్ ఆఫ్ పాట్‌హోల్ గ్రీవెన్స్ టు సబ్మిట్ యువర్ కంప్లైంట్' అనే సందేశం వస్తుంది. దానిని ఓపెన్ చేసి ఆధార్ వెరిఫికేషన్ కోసం ఆధార్ నంబర్ నమోదు చేసి, ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయాలి. ఆ తర్వాత రోడ్డుపై ఉన్న గుంత ఫొటో తీసి అప్‌లోడ్ చేయడంతో పాటు ఆ ప్రాంతం కరెంట్ లొకేషన్‌ను షేర్ చేస్తే సరిపోతుంది.

ఈ ప్రక్రియ పూర్తవ్వగానే ఫొటోతో కూడిన సమస్యపై గ్రీవెన్స్ నమోదైనట్లు ఫిర్యాదుదారుకు సమాచారం అందుతుంది. ఆ వివరాలు వెంటనే సంబంధిత శాఖకు చేరతాయి. అధికారులు స్పందించి ఆ గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకుంటారు. గుంతల రహిత రహదారుల సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది.

కైలాసగిరి బస్సు ప్రమాదంపై పవన్ కళ్యాణ్ ఆరా

విశాఖ, కాకినాడ కలెక్టర్లతో మాట్లాడిన డిప్యూటీ సీఎం

గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

స్కూలు బస్సుల కండిషన్‌పై నిరంతరం తనిఖీలు చేయాలి

విద్యార్థుల భద్రతలో నిర్లక్ష్యానికి తావుండొద్దని స్పష్టం

అమరావతి, నవంబర్ 28 (సమయం న్యూస్): విశాఖపట్నంలోని కైలాసగిరి కొండపై ఘాట్ రోడ్డులో పిఠాపురానికి చెందిన స్కూలు బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు, వైద్య సహాయక చర్యల పురోగతిపై విశాఖపట్నం, కాకినాడ జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీ ఆదర్శ్ ఇంగ్లీష్ మీడియం స్కూలుకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు విహార యాత్రలో భాగంగా కైలాసగిరికి రాగా, శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3.15 గంటల సమయంలో ఘాట్ రోడ్డులో కిందకు దిగుతుండగా బస్సు బ్రేకులు విఫలమై ప్రమాదం చోటుచేసుకుందని విశాఖ కలెక్టర్ వివరించారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 37 మంది ఉండగా, ఒక ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారని తెలిపారు. వారిని విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలకు చెందిన బస్సుల కండిషన్‌పై రవాణా, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యా విహార యాత్రలకు విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో బస్సుల బ్రేకులు, ఇతర సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ప్రయాణానికి అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.

నక్సల్ రహిత ఏపీయే ప్రధాన లక్ష్యం

18 మంది మావోయిస్టులకు రూ.75 లక్షల చెక్కులు

త్వరలో మరో 32 మందికి రూ.1.21 కోట్ల సాయం

రాష్ట్ర సరిహద్దుల్లో నిరంతర నిఘా.. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వెల్లడి



మంగళగిరి, నవంబర్ 28 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌ను నక్సల్ రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రధాన లక్ష్యమని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. పోలీసుల ఎదుట స్వయంగా లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస సహాయం కింద మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఆయన చెక్కులు పంపిణీ చేశారు. 18 మందికి రూ.75 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. వీరిలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు కమలేశ్‌తో పాటు ఇద్దరు డివిజనల్, 10 మంది ఏరియా, ఐదుగురు దళ సభ్యులు ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన మరో 32 మంది మావోయిస్టులకు త్వరలోనే రూ.1.21 కోట్ల సహాయం అందిస్తామని ఆయన తెలిపారు.

96 శాతం గ్రామాలకు నెట్‌వర్క్ అనుసంధానం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్‌ను నక్సల్ రహిత రాష్ట్రంగా మార్చామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా వివరించారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో 96 శాతం గ్రామాలకు నెట్‌వర్క్ అనుసంధానం చేశామని తెలిపారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగుతోందని, మావోయిస్టుల డంపుల గురించి ఉన్న సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

రెండున్నరేళ్లలో 134 మంది లొంగుబాటు

ప్రస్తుతం దాదాపుగా మావోయిస్టులంతా జనజీవన స్రవంతిలో కలిసిపోయారని, గత రెండున్నరేళ్లలో మొత్తం 134 మంది లొంగిపోయారని డీజీపీ తెలిపారు. హింసతో ఎవరూ ఏదీ సాధించలేరనే మార్పు వారిలో స్పష్టంగా వచ్చిందని పేర్కొన్నారు. లొంగిపోయిన నక్సలైట్లతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వారి జీవనోపాధిపై ఆరా తీస్తున్నామని, గతంలో లొంగిపోయిన వారికి పలు రంగాల్లో శిక్షణ ఇప్పించి ఉపాధి పొందేలా చర్యలు చేపట్టామని చెప్పారు. పునరావాస పాలసీ కింద అందిస్తున్న రివార్డు మొత్తం వారి జీవితంలో మరో అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఎవరూ మావోయిస్టులుగా మారవద్దని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని డీజీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

రెబల్స్‌తో చర్చించి సమస్యలు పరిష్కరించాలి

కష్టపడే కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యం

పార్టీ ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహణ

టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్

అమరావతి, నవంబర్ 28 (సమయం న్యూస్) : రాష్ట్రంలో రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైన నేపథ్యంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పార్టీ ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల వ్యూహాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులందరినీ అత్యధిక ఎమ్మెల్యే మెజారిటీతో గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. రెబల్స్ అంశంపై స్థానిక నేతలు వెంటనే చొరవ తీసుకుని, వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎలాంటి విభేదాలకు తావులేకుండా కూటమి అభ్యర్థుల విజయానికి పూర్తిస్థాయిలో సహకరించాలని స్పష్టం చేశారు.



కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు

పార్టీ కోసం కష్టపడి పనిచేసే నిజమైన కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం అంకితభావంతో శ్రమించిన వారికి రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవుల్లో కచ్చితంగా ప్రాధాన్యం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అందరూ సమష్టిగా ముందుకు సాగి రెండో విడత ఎన్నికల్లోనూ విజయదుందుభి మోగించాలని లోకేశ్ ఆకాంక్షించారు.



విద్య, పర్యాటక పథకాలపై నీతి ఆయోగ్ సమీక్ష

కేంద్ర, రాష్ట్ర కార్యక్రమాల పురోగతిపై చర్చ

లక్ష్యాల సాధన, అమలు తీరుపై ఆరా

సీఎస్ సాయి ప్రసాద్‌తో డా. జోరమ్ ఆనియా భేటీ

విజయవాడ, నవంబర్ 28 (సమయం న్యూస్) : నీతి ఆయోగ్ సభ్యురాలు డా. జోరమ్ ఆనియా శనివారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌తో భేటీ అయ్యారు. సీఎస్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో విద్య, పర్యాటక, యువజన సంక్షేమ రంగాల్లో అమలవుతున్న వివిధ పథకాలు, ప్రాజెక్టులు, కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల వివరాలను నీతి ఆయోగ్ సభ్యురాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా రంగాల్లో సాధించిన పురోగతి, కార్యక్రమాల అమలు తీరు, లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ రంగాల్లోని పథకాల పురోగతిని సీఎస్ సాయి ప్రసాద్ ఆమెకు వివరించారు. ఈ సమావేశంలో పర్యాటక, యువజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, శాప్ ఎండీ భరణి, యువజన సంక్షేమ శాఖ డైరెక్టర్ నీలకంఠారెడ్డి, నీతి ఆయోగ్ ఆరోగ్య విభాగం రాష్ట్ర నోడల్ అధికారి డా. సేతుపతి తదితరులు పాల్గొన్నారు.

పోలవరానికి తొలిసారి ఎన్‌డీఎస్‌ఏ బృందం

ప్రాజెక్టు భద్రతపై క్షేత్రస్థాయి పరిశీలన

స్పిల్‌వే, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనుల తనిఖీ

జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష



పోలవరం, నవంబర్ 28 (సమయం న్యూస్): పోలవరం ప్రాజెక్టును తొలిసారిగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ప్రతినిధి బృందం సందర్శించింది. ఆనకట్టల భద్రతకు సంబంధించి ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, ప్రాజెక్టు నిర్మాణంలో అనుసరిస్తున్న భద్రతా ప్రమాణాలు, భవిష్యత్తులో చేపట్టనున్న పర్యవేక్షణ వ్యవస్థలపై శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. ప్రాజెక్టులోని వివిధ నిర్మాణాలను సందర్శించి, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించింది. ఎన్‌డీఎస్‌ఏ సదరన్ జోన్ డైరెక్టర్ గిరిధర్, డిప్యూటీ డైరెక్టర్ హేమాదిత్య ఈ పర్యటనలో పాల్గొన్నారు. శనివారం ఉదయం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి చేరుకున్న ఎన్‌డీఎస్‌ఏ బృందానికి జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్టు నమూనా ద్వారా నిర్మాణ స్వరూపాన్ని వివరించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, వివిధ నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులు, మిగిలిన పనుల పురోగతిని తెలియజేశారు. అనంతరం ప్రాజెక్టు సమావేశ మందిరంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) పి. రామచంద్రరావు వివిధ విభాగాల వారీగా పనుల పురోగతిని గణాంకాలతో సహా వివరించారు.

స్పిల్‌వే, ఈసీఆర్ఎఫ్ పనుల పరిశీలన

అనంతరం ఎన్‌డీఎస్‌ఏ బృందం ప్రాజెక్టులోని స్పిల్‌వే, గ్యాప్-1, గ్యాప్-2, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ తదితర నిర్మాణ ప్రాంతాలను సందర్శించింది. ఆనకట్ట భద్రతకు సంబంధించి నిర్మాణ దశ నుంచే చేపట్టిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు భద్రతకు ప్రాధాన్యమిస్తూ తీసుకున్న చర్యలను ఎస్ఈ రామచంద్రరావు వివరించారు. వివిధ నిర్మాణాల వద్ద ఆనకట్ట భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటి పనితీరు, వాటి ద్వారా సేకరిస్తున్న సమాచారంపై బృందం ఆరా తీయగా, సంబంధిత వివరాలను అధికారులు ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ పర్యటనలో ఈఈలు బాలకృష్ణ, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ఎల్.వి. రావు తదితరులు పాల్గొన్నారు. ఎన్‌డీఎస్‌ఏ బృందం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను ఎంఈఐఎల్ జీఎం ఎ. గంగాధర్, డీజీఎం మురళి పమ్మి పర్యవేక్షించారు.

నరసింగపురం అగ్నిప్రమాదంపై పవన్ కళ్యాణ్ విచారం

అమరావతి, నవంబర్ 28 (సమయం న్యూస్) : పిఠాపురం మండలం నరసింగపురం గ్రామంలో తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఓ పాడి రైతుకు చెందిన పశువులు, కోళ్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో పాడి రైతు తన జీవనాధారాన్ని కోల్పోవడం బాధ కలిగించిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

ప్రాథమిక సమాచారం మేరకు పిఠాపురం పల్లపువీధికి చెందిన రైతు కొత్తెం ధర్మారావుకు చెందిన తాటాకుల పాకలో అగ్నిప్రమాదం సంభవించగా 7 గేదెలు, 6 దూడలు, సుమారు 30 కోళ్లు మృతి చెందినట్లు కలెక్టర్ తెలిపారు. తాటాకుల పాకకు నిప్పు అంటుకోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కారణాలపై విచారణ జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

రాజ్యాంగ సవరణ బిల్లును ఉమ్మడిగా వ్యతిరేకిస్తాం

పునర్విభజన బిల్లుపై ఇండియా కూటమి నిర్ణయం

543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్ ఇవ్వాలి

25 ఏళ్లు రాష్ట్రాల సీట్లు మార్చొద్దు

విపక్ష భేటీ అనంతరం మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమయం న్యూస్): నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపడిన మహిళా రిజర్వేషన్ఉరాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ఉమ్మడిగా వ్యతిరేకించాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో రెండు గంటల పాటు జరిగిన విపక్ష నేతల సమావేశంలో రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీ, కపిల్ సిబల్, మనోజ్ ఝా సహా పలువురు నేతలు పాల్గొన్నారు. డీఎంకే, ఆప్, బీజేడీ వంటి పార్టీలు ఈ భేటీకి దూరంగా ఉన్నాయి. సమావేశం అనంతరం మాట్లాడిన మల్లికార్జున ఖర్గే బీజేపీపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నియోజకవర్గాల పునర్విభజన, రాజ్యాంగ సవరణ బిల్లు ప్రజాస్వామ్యాన్ని అంతమొందించే కుట్ర అని ఖర్గే ఆరోపించారు. ఓటర్ల జాబితా నుంచి 10 కోట్ల మందికి పైగా పేర్లను తొలగించి వివాదాస్పదమైన ఎన్నికల సంఘానికి పునర్విభజన బాధ్యతలు అప్పగించడం తమకు ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఈ ప్రక్రియ జరిగితే అక్రమాలు తప్పవని, అసోం, జమ్మూకశ్మీర్ తరహాలో తమకు అనుకూలంగా జనరల్ సీట్లను రిజర్వ్‌డ్‌గా, రిజర్వ్‌డ్ సీట్లను జనరల్‌గా మార్చే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



ఆ వర్గాలకు అన్యాయం

గత ఎన్నికల్లో '400 పార్' నినాదం ఇచ్చిన బీజేపీ, ఇప్పుడు లోక్‌సభ స్థానాలను 850కి పెంచి '800 పార్' లక్ష్యంతో అధికారాన్ని శాశ్వతంగా తమ గుప్పిట్లో ఉంచుకోవాలని చూస్తోందని ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగాన్ని సైతం మార్చి మనుస్మృతిని అమలు చేయాలని ఆ పార్టీ భావిస్తోందని విమర్శించారు. తాజా జనగణన ఆధారంగా పునర్విభజన జరిగితే ఎస్సీ, ఎస్టీలకు సీట్లు పెరుగుతాయని, అది ఇష్టం లేకే కేంద్రం ఈ బిల్లు ద్వారా ఆ వర్గాలకు అన్యాయం చేస్తోందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యానికి, ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ బిల్లును ఇండియా కూటమి పక్షాలన్నీ కలిసికట్టుగా వ్యతిరేకిస్తాయని ఖర్గే తేల్చిచెప్పారు. లోక్‌సభలో ప్రస్తుతమున్న 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని, రాబోయే 25 ఏళ్ల పాటు రాష్ట్రాల వారీగా సీట్ల కేటాయింపును యథాతథంగా ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.

దేశానికి తీవ్రమైన ప్రమాదం

గతంలోనూ ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి బీజేపీ ప్రయత్నించిందని, కానీ ఏప్రిల్‌లోనే అది తిరస్కరణకు గురైందని ఖర్గే గుర్తుచేశారు. అప్పటి నుంచి అవసరమైన సంఖ్యాబలాన్ని సంపాదించుకోవడానికి టీఎంసీ, ఎన్‌సీపీ, శివసేన వంటి రాజకీయ పార్టీలను క్రమపద్ధతిలో విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు తమకు తగినంత సంఖ్యాబలం ఉందని భావించి, చివరికి వారికి ఎవరు మద్దతు ఇస్తారో అనిశ్చితంగా ఉన్నప్పటికీ ఈ బిల్లును మళ్లీ ముందుకు తీసుకువస్తున్నారని ఖర్గే పేర్కొన్నారు. ఇది దేశానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుందని హెచ్చరించారు. సీట్ల సంఖ్యను 850కి పెంచడం దేశానికి అపారమైన హాని కలిగిస్తుందని, ప్రజాస్వామ్యానికి ముగింపు పలుకుతుందని కొందరు గ్రహించడంలో విఫలమవుతున్నారని ఖర్గే అన్నారు.

సవరించిన డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే మద్దతు

ఇది దక్షిణాది రాష్ట్రాల పోరాట విజయం

తమిళనాడు 7.18% వాటా తగ్గొద్దని తీర్మానం

1971 నిష్పత్తిని 25 ఏళ్లు పొడిగించాలి

డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ ప్రకటన



చెన్నై, నవంబర్ 28 (సమయం న్యూస్) : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ ప్రకటించారు. తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాలన్న తమ పోరాటానికి ఫలితం దక్కిందని, ఈ పరిణామం దక్షిణాది రాష్ట్రాల విజయమని ఆయన అభివర్ణించారు. శనివారం చెన్నైలో స్టాలిన్ అధ్యక్షతన జరిగిన డీఎంకే ఎంపీల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం పార్టీ సీనియర్ నేత, ఎంపీ ఎ. రాజా మీడియాతో మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుత లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచే ప్రతిపాదనకు డీఎంకే మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. గతంలో బిల్లును వ్యతిరేకించడానికి కారణమైన రెండు ప్రధాన డిమాండ్లను కేంద్రం తాజా ప్రతిపాదనలో లిఖితపూర్వకంగా చేర్చిందని స్టాలిన్ తెలిపారు. 2024 నుంచి డీఎంకే కొనసాగిస్తున్న పోరాటానికి ఇది విజయమని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తమిళనాడుతో పాటు అన్ని దక్షిణాది రాష్ట్రాలకు ఈ పరిణామం ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. డీలిమిటేషన్ బిల్లు అంశంపై ప్రజలు భావోద్వేగాలకు లోనుకాకుండా ప్రశాంతంగా ఆలోచించాలని స్టాలిన్ సూచించారు. సవరించిన బిల్లును వ్యతిరేకిస్తే అన్ని రాష్ట్రాలకు 50 శాతం అదనపు లోక్‌సభ స్థానాలు కల్పించే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే మద్దతు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. కాగా, ఈ బిల్లుకు డీఎంకే మద్దతు ప్రకటించడం ప్రతిపక్ష కూటమిలో చర్చనీయాంశంగా మారింది.

న్యాయమైన డీలిమిటేషన్‌పై కీలక తీర్మానం

నవంబర్ 30న ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో జరిగిన డీఎంకే ఎంపీల సమావేశంలో కీలక తీర్మానం ఆమోదించారు. పార్లమెంటు నియోజకవర్గాల కేటాయింపులో తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.18 శాతం వాటా ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గకూడదని, 1971 జనాభా గణన ఆధారంగా నిర్ణయించిన రాష్ట్రాల వారీ ప్రాతినిధ్య నిష్పత్తిని మరో 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జనాభా నియంత్రణ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసిన తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలగని రీతిలో న్యాయమైన డీలిమిటేషన్ జరగాలని డీఎంకే మొదటి నుంచి పట్టుబడుతోందని తీర్మానంలో పేర్కొన్నారు. 2024 ఫిబ్రవరి 14న తమిళనాడు అసెంబ్లీ తీర్మానం, 2025 మార్చి 5న అఖిలపక్ష సమావేశం, 2025 మార్చి 22న చెన్నైలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలోనూ ఇదే డిమాండ్ చేసినట్లు గుర్తుచేశారు. 2002 రాజ్యాంగ సవరణ ద్వారా విధించిన 25 ఏళ్ల స్తంభన ముగుస్తున్నందున, 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందని పేర్కొన్నారు. అందుకే 1971 నిష్పత్తిని మరో 25 ఏళ్లు పొడిగిస్తూ 50 శాతం సీట్ల పెంపు చేపట్టడాన్ని సమర్థిస్తున్నట్లు డీఎంకే స్పష్టం చేసింది.

మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఎవరూ అడ్డుకోలేరు

- మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం
- లోక్‌సభ సీట్లు 850కి పెంచే ప్రతిపాదన
- 2029 ముందే కొత్త నియోజకవర్గాలు
- మూడు బిల్లులతో ఎన్నికల వ్యవస్థలో మార్పులు
- వీడియో సందేశంలో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమయం న్యూస్) : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా లోక్‌సభ స్థానాలను 850కి పెంచే ప్రతిపాదనతో పాటు 2029 ఎన్నికలకు ముందే కొత్త నియోజకవర్గాల ఏర్పాటు, మూడు బిల్లుల ద్వారా ఎన్నికల వ్యవస్థలో మార్పులకు సన్నాహాలు చేస్తోంది. ఈ అంశంపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిల్లులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం కీలక ప్రకటన చేశారు. మహిళలకు ఇచ్చిన హామీని అమలు చేయడానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పార్లమెంట్‌తో పాటు రాష్ట్ర శాసనసభల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే ప్రయత్నాలను ఎవరూ ఎక్కువకాలం నిలువరించలేరని పేర్కొన్నారు.

నవంబర్ 30న పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మోదీ సోషల్ మీడియా ద్వారా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. రాజకీయాల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ దశాబ్దాలుగా కొనసాగుతోందని ఆయన గుర్తుచేశారు. ఈ లక్ష్య సాధన కోసం తాను కూడా సుదీర్ఘకాలంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగస్వామిగా ఉన్నానని చెప్పారు. ఎంతోమంది మహిళలు ప్రత్యక్షంగా, లేఖల ద్వారా తమ ఆకాంక్షలను తనకు తెలియజేశారని వివరించారు. దేశంలోని నారీశక్తి ఆశీస్సులు తమ ప్రభుత్వానికి సంపూర్ణంగా ఉన్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

మహిళా రిజర్వేషన్ అమలుకు అడ్డుగా ఉన్న అవరోధాలను తొలగిస్తామని ప్రతి మహిళకు హామీ ఇస్తున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ సంకల్పం, ధైర్యం, పట్టుదల బలంగా ఉన్నాయని చెప్పారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచే నిర్ణయాన్ని



వ్యతిరేకించే పార్టీలు ఈ ప్రక్రియను నిరవధికంగా అడ్డుకోలేవని వ్యాఖ్యానించారు. పార్లమెంట్, అసెంబ్లీల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం ఖాయమని, అది ఎప్పుడు జరుగుతుందనేదే ఇప్పుడు మిగిలిన ప్రశ్న అని మోదీ పేర్కొన్నారు.

850 సీట్ల ప్రతిపాదన ప్రజాస్వామ్య హత్యే

- 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్ ఇవ్వొచ్చు
- కమిషన్ కూర్పుపై తీవ్ర అభ్యంతరం
- డీఎంకే, టీడీపీ, జనసేన పునరాలోచించాలి
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమయం న్యూస్): బీజేపీ దేశాన్ని నియంతృత్వం వైపు తీసుకెళ్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాజ్యాంగ సవరణ బిల్లులో ప్రతిపాదించిన 850 లోక్‌సభ సీట్ల సంఖ్య ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే ప్రణాళికలో భాగమని ఆయన ధ్వజమెత్తారు. శనివారం ఢిల్లీలో ఇండియా కూటమి పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమైన అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు 850 సీట్లు అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న 543 స్థానాల్లోనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాలకు సమాన వాటా, సీట్ల ఫ్రీజింగ్ అనేది సమస్య కాదని రాహుల్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు ఒక ఖాళీ కాన్వాస్ ఇచ్చి, దేశ నియోజకవర్గాల మ్యాప్‌ను తమకు నచ్చినట్లుగా మళ్లీ గీసుకునే అవకాశం కల్పించడమే ఈ బిల్లు ఉద్దేశమని ఆరోపించారు. ఒక్క ఓటు పడకముందే బీజేపీకి భారీ ప్రయోజనం చేకూర్చేలా, ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న సామాజిక వర్గాల ప్రాతినిధ్యాన్ని తగ్గించేలా ఈ ప్రణాళిక ఉందని విమర్శించారు. 850 సీట్లు ఎందుకనే దానికి సమాధానం జమ్మూకశ్మీర్, అస్సాంలో ఉందన్నారు. ఆ రాష్ట్రాల్లో ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి లక్షల మంది ఓటర్లను మార్చారని, ఒక చోట 26 లక్షలు, మరో చోట 19 లక్షల మంది ఉండేలా మార్పులు చేశారని ఆరోపించారు. అస్సాంలోని కాజీరంగా నియోజకవర్గ ఆకృతిని, రెండు వేర్వేరు ముక్కలుగా విడిపోయిన మంగళ్‌దోయ్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఉదాహరణలుగా చూపుతూ, రాజకీయ ప్రయోజనాల కోసమే సరిహద్దులు మార్చారని ఆయన అన్నారు.

కమిషన్ కూర్పుపై అభ్యంతరం

డీలిమిటేషన్ కమిషన్ కూర్పుపై రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మోదీ, అమిత్ షాలకు పూర్తి నియంత్రణ లభించేలా కమిషన్‌ను రూపొందిస్తున్నారని ఆరోపించారు. ఇందులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఒక సభ్యుడిగా, మోదీఉషా ఎంపిక చేసిన విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి మరొక సభ్యుడిగా ఉంటారని, మూడో సభ్యుడిని జ్ఞానేశ్ కుమార్ ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ కమిషన్ తీసుకునే నిర్ణయాలను కోర్టులో సవాల్ చేయడానికి వీల్లేకుండా పూర్తి రక్షణ కల్పిస్తున్నారని విమర్శించారు. కమిషన్ నిష్పక్షపాతంగా ఉండాలంటే ప్రతిపక్షం నుంచి ఒక నామినీ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ప్రభుత్వం నుంచి ఒక నామినీ ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘాన్ని ఇప్పటికే గుప్పిట్లోకి తీసుకున్నారని, ఇప్పుడు డీలిమిటేషన్ కమిషన్ ద్వారా దేశ పునాదులను, దేశ ఆత్మను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

ఓటింగ్ ప్రక్రియలో అక్రమాలు

2024 లోక్‌సభ ఎన్నికలు న్యాయబద్ధంగా జరగలేదని, ఆ ఎన్నికలు చట్టవిరుద్ధమని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. 2024 ఎన్నికల్లో ఓటు వేసే అర్హత లేని 14 కోట్ల మంది ఓటు వేశారని ఆరోపిస్తూ, ప్రధాని మోదీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్, అదానీ, అంబానీలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ భవిష్యత్తును దెబ్బతీసే ఈ కుట్రను యువత గ్రహించాలని పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్, బిహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలు, ఓటింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల తర్వాత మూడు నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో మార్పులు జరిగాయని, హరియాణాలో బ్రెజిలియన్ మోడల్ ఫొటోతో ఓటరు నమోదు కావడం అక్రమాలకు నిదర్శనమని పేర్కొన్నారు.

డీఎంకే, టీడీపీ, జనసేనకు విజ్ఞప్తి

డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే మద్దతు ప్రకటించడంపై రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎం.కె. స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. పార్టీల రాజకీయ ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలు, ప్రజాస్వామ్య పరిరక్షణే ముఖ్యమని ఆయన అన్నారు. డీఎంకేతో పాటు ఎన్డీఏలోని దక్షిణాది పార్టీలైన తెలుగుదేశం, జనసేన కూడా ఈ బిల్లుకు మద్దతు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుకు సంబంధించిన అంశమని, ప్రజాస్వామ్యాన్ని ఎవరు కాపాడుతున్నారు, ఎవరు విఘాతం కలిగిస్తున్నారన్నది ఈ పోరాటంలో తేలిపోతుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు

ఎక్స్ వేదికగా కేటీఆర్ కీలక ప్రకటన

హైదరాబాద్, నవంబర్ 28 (సమయం న్యూస్) : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై బీఆర్ఎస్ కీలక నిర్ణయం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన సవరించిన డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వనున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యానికి భంగం కలగకూడదని, తెలంగాణకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలన్నదే మొదటి నుంచి తమ ప్రధాన డిమాండ్‌గా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో పార్టీ నిరంతరం తన వాదనను వినిపిస్తూ వచ్చిందని తెలిపారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న 24 శాతం ప్రాతినిధ్య వాటాను యథాతథంగా కొనసాగించాలని బీఆర్ఎస్ కోరుతూ వచ్చిందని కేటీఆర్ వివరించారు. కేంద్రం తాజాగా తీసుకొచ్చిన సవరణలో రాష్ట్రాల మధ్య ప్రస్తుత ప్రాతినిధ్య నిష్పత్తిని 2051 వరకు మార్చకుండా కొనసాగించే ప్రతిపాదన తమ ప్రధాన అభ్యంతరానికి పరిష్కారంగా ఉందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాల వాటాకు రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు.



రాష్ట్ర ప్రయోజనాలకే ప్రాధాన్యం

అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ప్రస్తుత సంఖ్యతో పోలిస్తే 50 శాతం పెంచే ప్రతిపాదన వల్ల తెలంగాణకు ప్రయోజనం కలుగుతుందని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి ఉన్న 17 లోక్‌సభ స్థానాలు 26కు చేరనున్నాయని వెల్లడించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని, రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని పార్టీ నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఈ ప్రతిపాదనకు మద్దతుగా ఓటు వేస్తారని ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు కూడా బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ పునరుద్ఘాటించారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచే అంశంపై పార్టీకి ఎలాంటి భిన్నాభిప్రాయం లేదని, రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నామని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

30న డీలిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టనున్న అమిత్ షా

ఆగస్టు నాటి పాత బిల్లుల ఉపసంహరణ

అమిత్ షాతో డీఎంకే ఎంపీల కీలక భేటీ

543 నుంచి 816కి లోక్‌సభ సీట్ల పెంపు

అజెండా విడుదల చేసిన లోక్‌సభ సచివాలయం

న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమయం న్యూస్) : లోక్‌సభ సచివాలయం శనివారం సాయంత్రం విడుదల చేసిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల అజెండా ప్రకారం.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నవంబర్ 30న మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్, 132వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. అంతకుముందు ఆగస్టులో లోక్‌సభలో పెట్టిన పాత బిల్లులను కేంద్రం ఉపసంహరించుకోనుంది. మరోవైపు, ఢిల్లీలోని అమిత్ షా నివాసంలో శనివారం సాయంత్రం డీఎంకే ఎంపీలు ఆయనతో సమావేశమయ్యారు. అమిత్ షాతో సమావేశం అనంతరం డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొస్తున్న డీలిమిటేషన్ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. గతంలో తమ పార్టీ చేసిన ప్రతిపాదనలను కొత్త బిల్లులో చేర్చారని, అందుకే ఈ బిల్లుకు మద్దతివ్వాలని నిర్ణయించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. కాగా, ఈ ప్రత్యేక సమావేశంలో ఇండియా కూటమితో కాకుండా విడిగా కూర్చునేందుకు అనుమతివ్వాలని డీఎంకే ఎంపీలు చేసిన విజ్ఞప్తిని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అంగీకరించారు. దీంతో సోమవారం జరగనున్న సమావేశంలో డీఎంకేకు చెందిన 22 మంది ఎంపీలు ఇండియా కూటమికి దూరంగా కూర్చోనున్నారు. ఈ ఏడాది మే నెలలో తమిళనాడు అసెంబ్లీ ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగంకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంతో డీఎంకే ఇండియా కూటమికి దూరంగా ఉంటోంది.



సోమవారం బీఏసీ భేటీ.. 816కి సీట్లు

సభా కార్యకలాపాల నిర్వహణపై సోమవారం ఉదయం 10 గంటలకు బీఏసీ సమావేశం జరగనుందని లోక్‌సభ సచివాలయం తెలిపింది. అమిత్ షా ప్రవేశపెట్టనున్న బిల్లులపై అన్ని పార్టీల సంఖ్యాబలానికి అనుగుణంగా మాట్లాడే సమయం కేటాయించనున్నట్లు వెల్లడించింది. దేశంలో ప్రస్తుత జనగణనతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం ఉన్న 543 సీట్లు 816కి పెరుగుతాయని కేంద్రం పేర్కొంది. బిల్లులో ప్రతిపాదించిన విధంగా ఏయే రాష్ట్రాల్లో ఎన్నెన్ని సీట్లు పెరగనున్నాయో తెలిపే వివరాలతో కూడిన ఫొటోను పార్లమెంటరీ వ్యవహారాలు, న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో షేర్ చేశారు.



డీలిమిటేషన్‌తో మహిళా కోటాకు మార్గం

అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదన

2029 ఎన్నికల్లో మహిళలకు 33 శాతం కోటా లక్ష్యం

బిల్లులకు విపక్షాల నుంచి పెరుగుతున్న మద్దతు

అన్ని పార్టీలు సహకరించాలని బీజేపీ విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 28 (సమయం న్యూస్) : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లు దేశంలో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కీలక అడుగు అని బీజేపీ పేర్కొంది. కేంద్ర కేబినెట్ ఆమోదించిన 132వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచాలని ప్రతిపాదించినట్లు తెలిపింది. ఈ మార్పుతో 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఏర్పడుతుందని వెల్లడించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. నారీశక్తి వందన్ చట్టం ద్వారా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే హామీ కార్యరూపం దాల్చనుందని పేర్కొన్నారు. పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే ఈ నిర్ణయానికి పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా మహిళా రిజర్వేషన్ల అమలుపై ఎక్స్‌లో వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. తమ ప్రభుత్వం ఈ రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేస్తుందని, వ్యతిరేకించే పార్టీలు కూడా ఈ ప్రక్రియను అడ్డుకోలేవని వ్యాఖ్యానించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆ వీడియోను పంచుకుంటూ 'మహిళా సాధికారత అంటే మోదీ గ్యారెంటీ' అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో బిల్లులకు విపక్షాల నుంచి మద్దతు పెరుగుతోంది. తమిళనాడులోని డీఎంకే, తెలంగాణలోని బీఆర్ఎస్ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల బిల్లులకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాయి. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) కూడా మహిళా కోటాకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

తిరుపతిలో మూడు రోజుల పాటు ప్రధాని మోదీ బస

ఏర్పేడు ఐసర్‌లో 61వ అఖిల భారత డీజీపీ, ఐజీపీ సదస్సు

అమిత్ షా, అజిత్ దోభాల్ సహా 200 మంది ఐపీఎస్‌ల హాజరు

డిసెంబర్ 6న తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్న ప్రధాని

స్వాగతం పలకనున్న గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం



తిరుపతి, నవంబర్ 28 (సమయం న్యూస్) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తిరుపతిలో మూడు రోజుల పాటు బస చేయనున్నారు. ఏర్పేడు వద్దనున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్) వేదికగా జరగనున్న 61వ అఖిల భారత పోలీస్ డైరెక్టర్ జనరల్స్ (డీజీపీ, ఐజీపీ) సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. డిసెంబర్ 4న ప్రారంభమయ్యే ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో దేశ అంతర్గత భద్రత తదితర ముఖ్యమైన అంశాలపై ప్రధాని అధ్యక్షతన సమీక్షించనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, వివిధ రాష్ట్రాల డీజీపీలు, ఐజీపీలతో పాటు 200 మంది ఐపీఎస్ అధికారులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. సదస్సు చివరి రోజైన డిసెంబర్ 6న ప్రధాని మోదీ తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు.

ప్రధాని పర్యటన ఇలా..

ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి డిసెంబర్ 4న రాత్రి 8.30 గంటలకు ప్రధాని మోదీ రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ఐసర్‌కు చేరుకుని, రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు శనివారం ఉదయం 8.15 నుంచి రాత్రి 9 గంటల వరకు సదస్సులో వివిధ అంశాలపై జరిగే చర్చాగోష్ఠుల్లో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఐసర్‌లో ఉండి, అనంతరం తిరుమలకు చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీవారిని దర్శించుకున్న తర్వాత ఢిల్లీకి తిరుగుపయనమవుతారు. ప్రధానికి స్వాగతం పలికేందుకు డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతికి రానున్నారు.

తిరుప్పరంకుండ్రం దీపస్తంభంపై వెలిగిన దీపం

- **సుప్రీంకోర్టు ఆదేశాలతో కార్తీక దీపోత్సవం**
- **30 కిలోల నెయ్యి, 50 మీటర్ల వత్తితో క్రతువు**
- **సీఆర్‌పీఎఫ్ కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహణ**
- **దర్గా చుట్టూ 50 మీటర్ల బఫర్ జోన్ ఏర్పాటు**



మధురై, నవంబర్ 28 (సమయం న్యూస్) : తమిళనాడులోని మధురై జిల్లా తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దీపస్తంభం (దీపత్తూన్)పై ఎట్టకేలకు దీపం వెలిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అర్చకులు శనివారం సరిగ్గా 5 గంటలకు కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ క్రతువు కోసం 30 కిలోల నెయ్యి, 50 మీటర్ల పొడవైన వత్తి, 5 కిలోల కర్పూరాన్ని వినియోగించారు. ఆలయ నిర్వహణ బాధ్యతలను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్. వైద్యనాథన్, జస్టిస్ వి. పార్థిబన్‌లకు సుప్రీంకోర్టు అప్పగించిన నేపథ్యంలో వారి పర్యవేక్షణలోనే అర్చకులు దీపాన్ని వెలిగించారు.

కట్టుదిట్టమైన భద్రత.. భక్తుల సంబరాలు

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొండ పరిసర ప్రాంతాలను సీఆర్‌పీఎఫ్ బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. కొండపై ఉన్న దర్గా చుట్టూ 50 మీటర్ల బఫర్ జోన్‌ను ఏర్పాటు చేశారు. ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించేందుకు స్థానికులు, భక్తులు భారీ సంఖ్యలో తరలిరాగా, వారిని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేసి కొండపైకి కేవలం 50 మంది భక్తులను మాత్రమే అనుమతించారు. రాతిస్తంభంపై దీపం వెలగగానే భక్తులు భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ప్రాంతమంతా మురుగన్ నినాదాలతో దద్దరిల్లగా, భక్తులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఇదీ వివాదం

సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్టు శిరస్సుకు సరిగ్గా పైన ఉన్న ఉచ్చిపిళ్లైయార్ ఆలయ దీప మండపంపై ఏళ్లుగా కార్తీక మహాదీపాన్ని వెలిగిస్తున్నారు. అయితే, అదే కొండపై ఉన్న సిక్కందర్ దర్గా సమీపంలోని పురాతన రాతి స్తంభంపై దీపం వెలిగించాలన్న అంశంపై కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. రాతిస్తంభంపై దీపం వెలిగించాలని గతేడాది మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసినా అవి అమలు కాలేదు. అనంతరం ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరగా, ఈ ఏడాది మాత్రమే రాతి స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ నెల 20న మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, ఆ ఉత్తర్వులను ఉల్లంఘించి కార్తీక పౌర్ణమి నాడు ఉచ్చిపిళ్లైయార్ ఆలయ దీప మండపంపైనే దీపం వెలిగించారు. దీంతో తమిళనాడు ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడిందంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం, తమిళనాడు ప్రభుత్వం కావాలనే తమ ఆదేశాలను ఉల్లంఘించిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం రాతిస్తంభంపై దీపం వెలిగించాల్సిందేనని స్పష్టం చేయడంతో, తాజాగా అర్చకులు ఆ క్రతువును పూర్తి చేశారు.

షోపియాన్‌లో లష్కరే తోయిబా అనుచరుల అరెస్టు

- **ముగ్గురు అనుమానితులను పట్టుకున్న బలగాలు**
- **రెండు హ్యాండ్ గ్రెనేడ్లు, 20 తూటాలు స్వాధీనం**
- **యూఏపీఏ, ఆయుధ చట్టం కింద కేసుల నమోదు**
- **ఉగ్ర నెట్‌వర్క్‌పై కొనసాగుతున్న దర్యాప్తు**



శ్రీనగర్, నవంబర్ 28 (సమయం న్యూస్) : జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను నియంత్రించేందుకు భద్రతా బలగాలు చేపట్టిన తనిఖీల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. షోపియాన్ జిల్లాలో లష్కరే తోయిబా (ఎల్ఈటీ)తో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న ముగ్గురిని పోలీసులు, ఆర్మీ బలగాలు అరెస్టు చేశాయి. వారి నుంచి రెండు హ్యాండ్ గ్రెనేడ్లు, ఏకేఈ47 తుపాకీకి సంబంధించిన 20 రౌండ్ల బుల్లెట్లు సహా ఆయుధాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. షోపియాన్ జిల్లాలోని నర్వావ్, రావల్పోరా ప్రాంతాల్లో పోలీసులు, ఆర్మీకి చెందిన 34 రాష్ట్రీయ రైఫిల్స్ సంయుక్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (కాసో) చేపట్టాయి. ఈ సందర్భంగా అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిని అవెండ్ ప్రాంతానికి చెందిన అబ్రార్ అహ్మద్ మీర్, దాచిపోరాకు చెందిన రసిక్ అహ్మద్ భట్, సుహైల్ అహ్మద్ లోన్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి రెండు హ్యాండ్ గ్రెనేడ్లు, ఏకేఈ47కు సంబంధించిన 20 బుల్లెట్లు, లష్కరే తోయిబాకు చెందిన ఐదు పోస్టర్లు, మూడు మొబైల్ ఫోన్లు, మూడు ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సామగ్రిని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. ఆయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి చేరకుండా అడ్డుకోవడంలో ఈ ఆపరేషన్ కీలకమని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం ఉందనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌తో సంబంధాలున్న వ్యక్తులు, ఆయుధాల సరఫరా మార్గాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎఫ్ఐఆర్ నంబర్ 250/2026 నమోదు చేశారు. భారత ఆయుధ చట్టంలోని సెక్షన్లు 7, 25తో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)లోని సెక్షన్లు 13, 18, 23, 39 కింద కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఉగ్రవాదులకు ఆయుధాలు, ఇతర సహకారం అందించే వ్యవస్థలను గుర్తించి నిర్వీర్యం చేసేందుకు భద్రతా బలగాలు కశ్మీర్ వ్యాప్తంగా తనిఖీలు కొనసాగిస్తున్నాయి.

డీలిమిటేషన్‌పై తమిళనాడులో రాజకీయ చిచ్చు

- **బిల్లుకు డీఎంకే మద్దతుపై టీవీకే తీవ్ర విమర్శలు**
- **స్టాలిన్‌ను 'సావర్కర్ 2.0'గా అభివర్ణిస్తూ పోస్టులు**
- **ఆర్ఎస్ఎస్ దుస్తుల్లో ఉన్నట్లుగా మార్ఫింగ్ ఫొటోలు**
- **రెండు డిమాండ్లు చేర్చారనే మద్దతిచ్చామన్న స్టాలిన్**



చెన్నై, నవంబర్ 28 (సమయం న్యూస్): తమిళనాడు రాజకీయ పార్టీల మధ్య డీలిమిటేషన్ బిల్లు చిచ్చు రేపుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరించిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు డీఎంకే మద్దతు ప్రకటించడంతో రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్‌పై ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే తీవ్ర విమర్శలు గుప్పించింది. స్టాలిన్‌ను 'సావర్కర్ 2.0' అంటూ అభివర్ణించింది. ఈ మేరకు టీవీకే ఐటీ విభాగం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ ఫొటోను పోస్టు చేసింది. డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే మద్దతు ప్రకటించిన కొద్దిసేపటికే టీవీకే ఐటీ విభాగం ఎక్స్‌లో స్టాలిన్ చిత్రాన్ని పోస్టు చేసింది. అందులో ఆయనను ఆర్ఎస్ఎస్ యూనిఫాంలో ఉన్నట్లుగా మార్ఫింగ్ చేసి, 'స్టాలిన్ అలియాస్ సావర్కర్ 2.0' అనే వ్యాఖ్యను జత చేసింది. మరో పోస్టులో స్టాలిన్‌తో పాటు ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్‌ను కూడా ఆర్ఎస్ఎస్ దుస్తుల్లో చూపిస్తూ విమర్శలు చేసింది. 'సనాతనం కాదు.. సొన్ ధనం' అనే తమిళ పదప్రయోగంతో మరో సెటైర్ వేసింది.కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ బిల్లును డీఎంకే గతంలో తీవ్రంగా వ్యతిరేకించింది. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే, జనాభా నియంత్రణలో ముందున్న తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, కేంద్రం తాజాగా తీసుకొచ్చిన సవరించిన బిల్లుకు మద్దతు తెలిపింది. కొత్త ప్రతిపాదనలో తమ రెండు ప్రధాన డిమాండ్లను లిఖితపూర్వకంగా చేర్చారని, అందుకే బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు స్టాలిన్ వెల్లడించారు.



కేరళ సీఎం 'ప్రతీకారం' వ్యాఖ్యలపై తీవ్ర దుమారం

కార్యకర్తల రక్తానికి ప్రతిఫలం అడుగుతామన్న సతీశన్

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమంటూ సీపీఎం ఆగ్రహం

ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేయాలని డిమాండ్

కన్నూరు యూత్ కాంగ్రెస్ సభలో వ్యాఖ్యలతో వివాదం

తిరువనంతపురం, నవంబర్ 28 (సమయం న్యూస్) : కేరళలో గత పదేళ్లలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎదుర్కొన్న దాడులు, హింసను ప్రస్తావిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వీడీ సతీశన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. కాంగ్రెస్ కార్యకర్తల రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష సీపీఎం తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించింది. ఇటీవల కన్నూరులో యూత్ కాంగ్రెస్ నిర్వహించిన కార్యక్రమంలో సతీశన్ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో తమ కార్యకర్తలు ఎదుర్కొన్న దాడులను ప్రభుత్వం మరిచిపోదని, వాటికి బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెడతామని ఆయన పేర్కొన్నారు. తమ కార్యకర్తల రక్తానికి ప్రతిఫలం అడుగుతామని, గతంలో జరిగిన ఘటనలను మరిచిపోయే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. ఈ ఘటనల్లో బాధ్యులుగా ఉన్న వారందరిపై దర్యాప్తు కొనసాగించి, చివరి వరకు చట్టపరమైన పోరాటం చేస్తామని తెలిపారు. ఈ వ్యాఖ్యలను రాజకీయ ప్రతీకారానికి పిలుపుగా భావిస్తూ సీపీఎం నేతలు విమర్శలు గుప్పించారు. సతీశన్ వ్యాఖ్యలపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవిలోకి వచ్చారని, భయం, పక్షపాతం లేకుండా పాలన సాగించాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పేర్కొన్నారు. 'రక్తానికి రక్తం', 'ప్రతీకారం తీర్చుకుంటాం' అనే భావన వచ్చేలా ముఖ్యమంత్రి మాట్లాడటం తగదని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

క్షమాపణ చెప్పాకే అయోధ్యకు వెళ్లండి!

కరసేవకులపై కాల్పుల ఘటనపై యోగి డిమాండ్

మా రాజకీయ పిచ్‌పైకి అఖిలేశ్ వస్తున్నారు

బుల్డోజర్ నడపాలంటే సంకల్పబలం ఉండాలి

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చురకలు

లక్నో నవంబర్ 28 (సమయం న్యూస్) : ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో అయోధ్య రామమందిరం అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ డిసెంబర్ 12న అయోధ్య రామమందిరాన్ని సందర్శించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అఖిలేశ్ యాదవ్ తమ రాజకీయ పిచ్‌పైకి వచ్చి ఆడాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, అయోధ్యకు వెళ్లే ముందు గతంలో కరసేవకులపై జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి హిందువులకు క్షమాపణ చెప్పాలని అఖిలేశ్‌కు సూచించారు.

1990 నాటి కాల్పుల ఘటన ప్రస్తావన



రామమందిర నిర్మాణ ఉద్యమాన్ని గతంలో వ్యతిరేకించిన వారే ఇప్పుడు అయోధ్యకు వెళ్లాలని అనుకోవడం ఆసక్తికరమైన విషయమని సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా 1990లో అయోధ్యలో రామమందిర నిర్మాణ ఉద్యమం జరుగుతున్న సమయంలో కరసేవకులపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటనను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అప్పట్లో రాష్ట్రంలో సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వమే అధికారంలో ఉందని యోగి గుర్తుచేశారు. రామమందిరం కోసం నినాదాలు చేసిన కరసేవకులపై నాడు లాఠీచార్జి, కాల్పులు జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో అఖిలేశ్ యాదవ్ అయోధ్య రామమందిరాన్ని సందర్శించాలనుకుంటే, ముందుగా ఆ ఘటనకు సంబంధించి రామభక్తులకు క్షమాపణ చెప్పాల్సిందేనని సీఎం యోగి స్పష్టం చేశారు.

బుల్డోజర్ స్టీరింగ్ పట్టుకోవడం అందరికీ సాధ్యం కాదు

అయోధ్య పర్యటన అంశంతో పాటు ఇటీవల అఖిలేశ్ యాదవ్ చేపట్టిన గౌరఖ్‌పూర్ పర్యటనను కూడా సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రస్తావిస్తూ రాజకీయంగా విమర్శలు గుప్పించారు. బుల్డోజర్ అంశంపై అఖిలేశ్ చేస్తున్న వ్యాఖ్యలకు ఆయన తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. బుల్డోజర్ గురించి మాట్లాడటం ఎవరికైనా సులభమేనని, కానీ దాన్ని నడపాలంటే ప్రత్యేకమైన సంకల్పబలం ఉండాలని వ్యాఖ్యానించారు. బుల్డోజర్ స్టీరింగ్ పట్టుకోవడం అందరికీ సాధ్యం కాదంటూ అఖిలేశ్ యాదవ్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

మూడోసారి బీజేపీ కూటమిదే విజయం

రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుపై మాట్లాడిన యోగి ఆదిత్యనాథ్, రాబోయే ఎన్నికల్లోనూ ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా బీజేపీ, దాని మిత్రపక్షాలు ఘన విజయం సాధిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వారణాసి ఎలాగైతే శాశ్వతమైన నగరమో, భారత రాజకీయాల్లో బీజేపీ కూడా అదే విధంగా శాశ్వతమైన రాజకీయ శక్తిగా కొనసాగుతుందని సీఎం యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. అఖిలేశ్ యాదవ్ అయోధ్య పర్యటన ప్రకటన, దానికి ప్రతిగా సీఎం యోగి చేసిన వ్యాఖ్యలతో ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో వేడి రాజుకుంది.

డీలిమిటేషన్ బిల్లులో పాక్ ఆక్రమిత ప్రాంత ప్రస్తావన

విముక్తి పొందాక అక్కడ అసెంబ్లీ స్థానాల పునర్విభజన

- **బాధ్యతలను నేరుగా ఈసీకి అప్పగించేలా సెక్షన్ 3(4)**
- **బిల్లులో ఎక్కడా 'పీవోకే' పదం వాడని కేంద్రం**
- **పాత బిల్లుల ఉపసంహరణ.. సోమవారం కొత్త బిల్లులు**



న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమయం న్యూస్) : డీలిమిటేషన్ (సెకండ్) బిల్లు2026లో కేంద్ర ప్రభుత్వం కీలక నిబంధనను చేర్చింది. ఇందులో పాకిస్థాన్ ఆక్రమిత ప్రాంతం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతం విముక్తి పొందిన వెంటనే అక్కడ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టాలని బిల్లులో ప్రతిపాదించింది. ఈ బిల్లులోని సెక్షన్ 3(4) ప్రకారం ఆ ప్రాంతంలో ఎన్నికల కమిషనే (ఈసీ) స్వయంగా డీలిమిటేషన్ కమిషన్ బాధ్యతలు నిర్వర్తించనుంది. దేశంలోని ఇతర ప్రాంతాలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుండగా, పాక్ ఆక్రమిత ప్రాంతానికి మాత్రం నేరుగా ఎన్నికల కమిషన్‌కే కేంద్రం బాధ్యతలు అప్పగించింది. అయితే, ఈ బిల్లులో 'పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతం' అని పేర్కొన్నప్పటికీ, ఎక్కడా 'పీవోకే' అనే పదాన్ని వాడలేదు.

ఈ నిబంధన కేవలం అసెంబ్లీ నియోజకవర్గాలకే పరిమితం కాగా, అక్కడ లోక్‌సభ నియోజకవర్గాలు, గతంలో కేటాయించిన 24 సీట్లు లేదా 50 శాతం సీట్ల పెంపుపై ఈ బిల్లులో స్పష్టత లేదు. తాజా డీలిమిటేషన్, 50 శాతం సీట్ల పెంపు తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేసే 132వ రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుగుణంగా ఢిల్లీ, జమ్మూకశ్మీర్, పుదుచ్చేరి చట్టాల సవరణకు కేంద్రం మరో బిల్లును తీసుకురానుంది. గత ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో తగిన సంఖ్యాబలం లేక ఆమోదం పొందని విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న పాత బిల్లులను ఉపసంహరించుకుని, సోమవారం కొత్త రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సవరణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

రూ.300 టికెట్‌కు రూ.12 కోట్ల జాక్‌పాట్!

- **పాలక్కడ్‌లో అమ్ముడైన టికెట్‌కు బంపర్ బహుమతి**
- **పన్నులు, కమీషన్ పోను చేతికి రూ.7.56 కోట్లు**
- **ఒకే ఏజెన్సీకి వరుసగా రెండో ఏడాది ప్రథమ బహుమతి**
- **పది మందికి రూ.50 లక్షల చొప్పున రెండో బహుమతి**



తిరువనంతపురం, నవంబర్ 28 (సమయం న్యూస్) : కేరళ పూజా బంపర్ లాటరీ2026 విజేతల వివరాలు శనివారం వెల్లడయ్యాయి. రూ.300 టికెట్ కొనుగోలు చేసిన వ్యక్తికి ఏకంగా రూ.12 కోట్ల ప్రథమ బహుమతి లభించింది. పాలక్కడ్‌లో విక్రయించిన జేసీ 234428 నంబర్ టికెట్‌ను ఈ అదృష్టం వరించింది. తిరువనంతపురంలోని గోర్కీ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు లాటరీ డ్రా నిర్వహించారు. ప్రథమ బహుమతి కింద ప్రకటించిన రూ.12 కోట్లలో ఏజెంట్ కమీషన్ రూ.1.20 కోట్లు, టీడీఎస్ రూ.3.24 కోట్లు మినహాయించనున్నారు. ఈ లెక్కన విజేత చేతికి రూ.7.56 కోట్లు అందనున్నాయి. దీనికి అదనంగా వర్తించే పన్నులు, సర్‌ఛార్జ్, సెస్ కూడా చెల్లించాల్సి ఉంటుంది. బహుమతి పొందినవారు డ్రా తేదీ నుంచి 30 రోజుల్లోగా ఒరిజినల్ టికెట్‌తో పాటు అవసరమైన ధ్రువపత్రాలను లాటరీ శాఖకు అందజేయాలి. పాలక్కడ్‌లోని కింగ్స్ స్టార్ ఏజెన్సీకి వరుసగా రెండో ఏడాది పూజా బంపర్ ప్రథమ బహుమతి దక్కడం విశేషం. రెండో బహుమతి కింద పది టికెట్లకు రూ.50 లక్షల చొప్పున, మూడో బహుమతిగా మరో పది టికెట్లకు రూ.5 లక్షల చొప్పున ప్రకటించారు. నాలుగు, ఐదు బహుమతులతో పాటు కన్సోలేషన్ ప్రైజులను కూడా లాటరీ శాఖ వెల్లడించింది.

ఉత్తరాఖండ్‌లో లోయలో పడ్డ కారు.. ఏడుగురి మృతి

- **పౌరీ గర్వాల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం**
- **మరో ఐదుగురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు**
- **మృతుల కుటుంబాలకు ప్రధాని రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా**
- **ఘటనపై సీఎం పుష్కర్ సింగ్ ధామి తీవ్ర విచారం**



డెహ్రాడూన్, నవంబర్ 28 (సమయం న్యూస్) : ఉత్తరాఖండ్‌లోని పౌరీ గర్వాల్ జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ కారు లోయలో పడి ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రిఖ్నిఖాల్‌లోని కల్వాడి ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. భంగల్వాడ్ గ్రామానికి చెందిన 12 మంది దీదీఉభూలీ పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు రిఖ్నిఖాల్‌కు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి గ్రామానికి బయలుదేరగా, మార్గమధ్యంలో వారి వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్ సహా ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే స్థానిక బీజేపీ ఎమ్మెల్యే దిలీప్ రావత్ అక్కడికి చేరుకుని, బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రధాని మోదీ, సీఎం ధామి దిగ్భ్రాంతి

ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏడుగురి మృతితో తాను తీవ్రంగా కలత చెందినట్లు పేర్కొంటూ బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మరోవైపు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏడుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ దుఃఖాన్ని భరించే శక్తిని వారికి ప్రసాదించాలని ప్రార్థించారు.



కేకేఆర్ కొత్త కెప్టెన్‌గా రింకూ సింగ్?

సారథ్యంపై ఇర్ఫాన్ పఠాన్, ఆకాశ్ చోప్రా విశ్లేషణ

రహానే రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన కెప్టెన్సీ స్థానం

కోల్‌కతా, నవంబర్ 28 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కొత్త కెప్టెన్‌గా భారత స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని మాజీ పేసర్ ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నారు. క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి అజింక్య రహానే రిటైర్మెంట్ ప్రకటించడంతో కేకేఆర్‌లో సారథి స్థానం ఖాళీ అయింది. డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనున్న మినీ వేలానికి ముందే జట్టు నాయకత్వంపై చర్చ జోరందుకుంది. జియోస్టార్‌తో మాట్లాడిన ఇర్ఫాన్ పఠాన్.. ప్రస్తుత కేకేఆర్ జట్టులో నాయకత్వ అనుభవం ఉన్న ఆటగాళ్ల కొరత ఉందని తెలిపారు. వేలంలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ వంటి ఆటగాడిని కొనుగోలు చేసి పగ్గాలు అప్పగించే అవకాశం ఉన్నప్పటికీ, యాజమాన్యం ఆలోచనా సరళిని బట్టి చూస్తే రింకూ సింగ్‌కే కెప్టెన్సీ దక్కవచ్చని విశ్లేషించారు. రహానే నిష్క్రమణతో రఘువంశీ ఓపెనర్‌గా బరిలోకి దిగే వెసులుబాటు దక్కుతుందని, హర్షిత్ రాణా ఫిట్‌నెస్ సాధించి బౌలింగ్‌కు సిద్ధమవడం జట్టుకు కలిసొచ్చే అంశమని పేర్కొన్నారు. మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా సైతం రింకూ సింగ్ పేరును సమర్థించారు. గత సీజన్‌లో కేకేఆర్ వైస్ కెప్టెన్‌గా ఉన్న రింకూకు ఇప్పుడు సారథ్య బాధ్యతలు అప్పగించడమే సరైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. అనుభవజ్ఞుడైన సునీల్ నరైన్ కూడా తాత్కాలిక ఎంపికగా ఉపయోగపడగలడని సూచించారు. మరోవైపు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను రూ.25.20 కోట్ల భారీ ధరకు అట్టిపెట్టుకోవడంపై ఆకాశ్ చోప్రా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రీన్‌ను విడుదల చేసి ఉంటే వేలంలో రూ.41 కోట్ల కంటే ఎక్కువ పర్స్‌తో దిగే వెసులుబాటు దక్కేదని, యాషెస్ సిరీస్ నేపథ్యంలో గాయాల బారిన పడి అతడి లభ్యతపై అనుమానాలు ఉన్నాయని గుర్తుచేశారు. జట్టుకు మరో ఫాస్ట్ బౌలర్, మిడిలార్డర్ బ్యాటర్ అవసరమని మాజీ బ్యాటర్ అభినవ్ ముకుంద్ పేర్కొన్నారు.

జట్టుకు దిశానిర్దేశం కోసమే కెప్టెన్సీ: రోహిత్

ఆకాశ్ అంబానీతో చర్చించాకే మనసు మార్చుకున్నా

ముంబై, నవంబర్ 28 (సమయం న్యూస్): ముంబై ఇండియన్స్ (ఎంఐ) కెప్టెన్సీని మళ్లీ చేపట్టడానికి తాను ముందుగా సిద్ధంగా లేనని, అయితే గత కొన్ని పేలవ సీజన్ల తర్వాత జట్టుకు సరైన దిశానిర్దేశం అవసరమన్న భావనతోనే ఈ బాధ్యతను అంగీకరించానని ఆ జట్టు సారథి రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్‌ను శుక్రవారం తిరిగి నియమించిన విషయం తెలిసిందే. ఈ నెలారంభంలో పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌తో జరిగిన ట్రేడ్‌లో భాగంగా హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్లడంతో ఎంఐ పగ్గాలను మరోసారి తమ విజయవంతమైన సారథి చేతిలో పెట్టింది. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ సోషల్ మీడియా వేదికగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హిట్‌మ్యాన్ పలు కీలక వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత జట్టు ప్రదర్శనపై తన భార్యతో చర్చిస్తుండగా, ఫ్రాంచైజీ యజమాని ఆకాశ్ అంబానీ తనకు ఫోన్ చేశారని రోహిత్ తెలిపాడు. "ఆకాశ్‌తో సమావేశమై జట్టును ముందుకు ఎలా తీసుకెళ్లాలనే దానిపై మాట్లాడాం. మళ్లీ జట్టుకు నాయకత్వం వహించడానికి సిద్ధమేనా అని ఆయన అడిగారు. నిజం చెప్పాలంటే మొదట నేను సిద్ధంగా లేను. అప్పటికే చాలా జరిగిపోయాయి, ఆ మానసిక స్థితిలో ఉన్నానో లేదో తెలియలేదు. ఇంటికి వెళ్లి లోతుగా ఆలోచించా. నేను ఏం చేయగలనో, ఏం చేయలేనో, మళ్లీ కెప్టెన్‌గా వ్యవహరించగలనో లేదో అన్నీ బేరీజు వేసుకున్నా. ఈ జట్టుకు నేనే నాయకుడిగా ఉండాలనే అవసరం లేదు, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో జట్టుకు స్పష్టమైన దిశానిర్దేశం అవసరం. ఆ దిశను చూపే బాధ్యత నాపై ఉంటే సంతోషంగా స్వీకరిస్తానని అనిపించింది. ఇది నేను నిర్మించిన జట్టు. పదేళ్ల పాటు కెప్టెన్‌గా వ్యవహరించా. మరోసారి సవాల్‌ను స్వీకరించే సమయం వచ్చిందని భావించి అంగీకరించా" అని రోహిత్ వివరించాడు. గత కొన్ని సీజన్లలో ముంబై ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంపై రోహిత్ ఆవేదన వ్యక్తం చేశాడు. 2020లో ఐదో టైటిల్ గెలిచిన తర్వాత జట్టు మళ్లీ కప్పు అందుకోలేకపోయింది. 2024లో పదో స్థానంలో నిలిచి, 2025లో క్వాలిఫయర్2 వరకు చేరిన ఎంఐ, 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. "2026 సీజన్ చాలా నిరాశకు గురి చేసింది. నేను మాత్రమే కాదు, చాలా మంది ఆటగాళ్లు మా ఆటతీరు పట్ల తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఇంటికి వచ్చాక కూడా అదే ఆలోచించేవాడిని. 'అరే ఇది ఒకప్పుడు ఉన్న జట్టు కాదు.. మనం మళ్లీ ఆ స్థాయికి తిరిగి రావాలి' అనిపించేది. మా నిరాశకు కారణం ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించకపోవడం కాదు, మేము సరిగ్గా ఆడకపోవడమే. ఆటగాళ్లు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోయారు. ప్రత్యర్థి జట్లు మాపై ఒత్తిడి పెంచినప్పుడు దానికి దీటుగా స్పందించలేకపోయాం. ఒక్కరు ఇద్దరు కాదు, మొత్తం ఎంఐ విఫలమైంది" అని రోహిత్ అంగీకరించాడు. తాను కెప్టెన్ అయినంత మాత్రాన రాత్రికి రాత్రే అంతా మారిపోతుందని అనుకోవడం లేదని రోహిత్ తెలిపాడు. "ఐపీఎల్‌లో భిన్నమైన నేపథ్యాల నుంచి ఆటగాళ్లు వస్తారు. వారందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడం సవాల్‌తో కూడుకున్నది. ముందుగా ఆటగాళ్లంతా క్రికెట్‌ను ఆస్వాదించాలి, ఉత్సాహంగా ఆడుతూనే ముంబై ఇండియన్స్ తరఫున ఆడే బాధ్యతను అర్థం చేసుకోవాలి" అని పేర్కొన్నాడు.



క్రైస్ట్‌చర్చ్‌లో భారత్ బెంబేలు

రెండో టెస్టు రెండో రోజు ఆట ముగిసేసరికి 116/6

- **తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 240 పరుగులు వెనుకంజ**
- **కివీస్ పేసర్ల ధాటికి కుప్పకూలిన టాపార్డర్**
- **ఐదు వికెట్లతో మెరిసిన ఆకాశ్ దీప్.. న్యూజిలాండ్ 356 ఆలౌట్**



క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 28 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో భారత జట్టు తీవ్ర కష్టాల్లో చిక్కుకుంది. హాగ్లీ ఓవల్ మైదానంలో శనివారం జరిగిన రెండో రోజు ఆటలో కివీస్ పేసర్ల ధాటికి భారత బ్యాటింగ్ లైనప్ తడబడింది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగులకు ఆలౌట్ కాగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి కేవలం 116 పరుగులే చేసింది. ప్రస్తుతం ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్ స్కోరు కంటే టీమిండియా ఇంకా 240 పరుగులు వెనుకబడి ఉంది. ధ్రువ్ జురెల్ (7 నాటౌట్; 45 బంతుల్లో 1 ఫోర్) క్రీజులో ఉన్నాడు. వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగిసిన నేపథ్యంలో సిరీస్ ఫలితాన్ని, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఆశలను తేల్చే ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది.

ఆదిలోనే ఎదురుదెబ్బ.. వరుసగా పెవిలియన్‌కు

తొలి టెస్టులో ఏకంగా 720 పరుగులు సాధించిన భారత బ్యాటర్లు, క్రైస్ట్‌చర్చ్ పిచ్‌పై మాత్రం పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి బంతికే ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0)ను మ్యాట్ హెన్రీ క్లీన్ బౌల్డ్ చేసి భారత్‌కు గట్టి షాక్ ఇచ్చాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్ (21; 20 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) కాసేపు దూకుడుగా ఆడినప్పటికీ, కైల్ జేమీసన్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ బ్లండెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (17; 29 బంతుల్లో 3 ఫోర్లు), కె.ఎల్. రాహుల్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే టీ విరామానికి సరిగ్గా ముందు జేమీసన్ వేసిన చక్కటి బంతికి గిల్ స్లిప్‌లో టామ్ లాథమ్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ 59/3తో రెండో సెషన్‌ను ముగించింది. చివరి సెషన్‌లో రిషబ్ పంత్ (23; 39 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) తన సహజ శైలిలో ఎదురుదాడికి దిగాడు. జాకబ్ డఫ్ఫీ బౌలింగ్‌లో ఓ భారీ సిక్సర్ బాది ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేసినా, మరోసారి అనవసర షాట్‌కు ప్రయత్నించి జేమీసన్‌కు క్యాచ్ ఇచ్చి వికెట్ పారేసుకున్నాడు. కాసేపటికే ఓ ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న కె.ఎల్. రాహుల్ (25; 80 బంతుల్లో 3 ఫోర్లు) కూడా డఫ్ఫీ బౌలింగ్‌లో బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో డెవాన్ కాన్వేకు క్యాచ్ ఇచ్చి పెటయ్యాడు. దీంతో భారత్ 96/3 నుంచి 104/5కు పడిపోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది.

చివరి బంతికి సుందర్ ఔట్

ఐదు వికెట్లు కోల్పోయిన దశలో వాషింగ్టన్ సుందర్ (10; 60 బంతుల్లో), ధ్రువ్ జురెల్ (7 నాటౌట్) కలిసి సుమారు గంటన్నర పాటు కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. పరుగులు రాకపోయినా వికెట్ కాపాడుకుంటూ ఆరో వికెట్‌కు 12 పరుగులు జోడించి, మరో నష్టం లేకుండా రోజును ముగిస్తారనిపించారు. కానీ రెండో రోజు ఆట చివరి ఓవర్ ఆఖరి బంతికి నాథన్ స్మిత్ బౌలింగ్‌లో సుందర్ స్లిప్‌లో టామ్ లాథమ్‌కు క్యాచ్ ఇచ్చి పెటవడంతో భారత్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జేమీసన్ (2/33), జాకబ్ డఫ్ఫీ (2/21) చెరో రెండు వికెట్లు తీయగా, మ్యాట్ హెన్రీ (1/29), నాథన్ స్మిత్ (1/29) తలో వికెట్ పడగొట్టారు.

బ్లండెల్ పోరాటం.. ఆకాశ్ దీప్ ఐదు వికెట్లు

అంతకుముందు 246/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్‌ను ఆరంభంలోనే అన్షుల్ కాంబోజ్ దెబ్బతీశాడు. రెండో ఓవర్లోనే గ్లెన్ ఫిలిప్స్ (36)ను పెవిలియన్‌కు పంపాడు. అయితే తన 50వ టెస్టు మ్యాచ్ ఆడుతున్న వికెట్ కీపర్ టామ్ బ్లండెల్ (89; 211 బంతుల్లో 10 ఫోర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు నాథన్ స్మిత్ (26), కైల్ జేమీసన్ (19), మ్యాట్ హెన్రీ (19) విలువైన పరుగులు జోడించడంతో కివీస్ 350 పరుగుల మార్కును దాటింది. శతకానికి 11 పరుగుల దూరంలో ఉన్న బ్లండెల్‌ను అరంగేట్ర పేసర్ గుర్నూర్ బ్రార్ ఔట్ చేశాడు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ (5/99) నిప్పులు చెరిగాడు. రెండో రోజు నాథన్ స్మిత్, కైల్ జేమీసన్, మ్యాట్ హెన్రీ వికెట్లు తీసి టెస్టు కెరీర్‌లో తన రెండో ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. అయితే ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో మ్యాట్ హెన్రీ ఇచ్చిన సులువైన క్యాచ్‌లను దేవ్‌దత్ పడిక్కల్, గుర్నూర్ బ్రార్ జారవిడవడం భారత్‌కు నష్టం చేకూర్చింది. గుర్నూర్ బ్రార్ (2/78), అన్షుల్ కాంబోజ్ (2/79) రెండేసి వికెట్లు, వాషింగ్టన్ సుందర్ (1/36) ఒక వికెట్ తీశారు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 26 ఓవర్లు వేసి 49 పరుగులే ఇచ్చినా ఒక్క వికెట్ కూడా దక్కకపోవడం గమనార్హం.

ప్రస్తుతం భారత్ చేతిలో కేవలం నాలుగు వికెట్లు మాత్రమే ఉన్నాయి. ఫాలోఆన్ గండం తప్పించుకోవాలంటే కనీసం మరో 41 పరుగులు చేయాల్సి ఉంది. ఆదివారం జరిగే మూడో రోజు ఆట తొలి సెషన్‌లో ధ్రువ్ జురెల్‌తో పాటు లోయర్ ఆర్డర్ బ్యాటర్లు రాణించి న్యూజిలాండ్ ఆధిక్యాన్ని ఎంతవరకు తగ్గిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

అండర్-19 ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన

- **కెప్టెన్‌గా భావిక అహిరే, వైస్ కెప్టెన్‌గా అనాది టార్డే**
- **డిసెంబర్ 8 నుంచి అండర్-19 మహిళల ఆసియా కప్**
- **2027 టీ20 ప్రపంచకప్ లక్ష్యంగా 15 మంది ఎంపిక**
- **ఇంగ్లండ్‌పై 2-0 ఆధిక్యంతో జోరుమీదున్న యువ భారత్**



ముంబై, నవంబర్ 28 (సమయం న్యూస్): అండర్ఉ19 మహిళల ఆసియా కప్ 2026 కోసం డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. వికెట్ కీపర్, బ్యాటర్ భావిక అహిరేను సెలక్టర్లు జట్టు కెప్టెన్‌గా ఎంపిక చేయగా, అనాది టార్డేకు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. 2027లో జరగనున్న అండర్ఉ19 మహిళల టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును ఎంపిక చేశారు. డిసెంబర్ 8 నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుంది.

ప్రస్తుతం భారత యువ మహిళా జట్టు స్వదేశంలో ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడుతోంది. ఇప్పటివరకు జరిగిన తొలి రెండు టీ20ల్లోనూ విజయం సాధించి 2ఉ0 ఆధిక్యంలో కొనసాగుతోంది. ఈ సిరీస్‌లో యువ ఓపెనర్ అచ్చా పర్మార్ అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. తొలి మ్యాచ్‌లో 52 పరుగులు చేసిన ఆమె, రెండో టీ20లో 81 పరుగులతో ఆకట్టుకుంది.

మరోవైపు టాప్ ఆర్డర్‌లో దీయా యాదవ్ కూడా అద్భుతంగా రాణిస్తోంది. తొలి టీ20లో 29 పరుగులు చేసిన ఈ యువ బ్యాటర్, రెండో మ్యాచ్‌లో 87 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడింది. ప్రస్తుత భారత జట్టు ప్రదర్శన చూస్తుంటే మరోసారి ఆసియా కప్ ట్రోఫీని ముద్దాడటం ఖాయంగా కనిపిస్తోంది. 2024 తర్వాత జరుగుతున్న అండర్ఉ19 మహిళల ఆసియా కప్ రెండో ఎడిషన్ ఇది. గత ఎడిషన్ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించి భారత్ విజేతగా నిలిచింది.

భారత అండర్-19 జట్టు:

భావిక అహిరే (కెప్టెన్, వికెట్ కీపర్), ఇరా జాదవ్, నిధి మహతో, పూర్వా సివాచ్, మహక్ నర్వాసే, మైత్రి మణియార్, ఈశ్వరి అవాసరే, దీయా యాదవ్, శ్రేయ ఎస్. చవాన్ (వికెట్ కీపర్), సమైరా రాఘవ్, కుమారి పాలక్, ఉమా కాష్యి, అచ్చా పర్మార్, అనాది టార్డే (వైస్ కెప్టెన్), పాలక్ సింగ్.

భారత ఫీల్డింగ్‌పై గావస్కర్ ఫైర్

క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 28 (సమయం న్యూస్): క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో భారత జట్టు ఫీల్డింగ్ వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. శనివారం జరిగిన రెండో రోజు ఆటలో ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో నాథన్ స్మిత్ బ్యాట్ అంచు తాకిన బంతి రెండో స్లిప్‌లో ఉన్న కె.ఎల్. రాహుల్ ముందు పడటంతో త్రుటిలో క్యాచ్ చేజారింది. దీనిపై కామెంట్రీ బాక్స్‌లో ఉన్న మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



రెండో రోజు ఆట ముగిసిన తర్వాత తన ఆగ్రహానికి గల కారణాన్ని గావస్కర్ వివరించారు. క్యాచ్‌లు జారవిడవడం ఆటలో సహజమే అయినా, ఫీల్డర్ల స్థానాల (పొజిషన్) విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తొలి రోజు ఆట నుంచే భారత స్లిప్ ఫీల్డర్లు కొంచెం ముందుకు వచ్చి నిల్చోవాలని తాను చెబుతున్నానని, సరైన స్థానంలో ఉండి ఉంటే మరికొన్ని క్యాచ్‌లు అందుకునే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. చిన్న చిన్న తప్పులను సరిదిద్దుకుంటేనే పెద్ద విజయాలు అందుతాయని గావస్కర్ హితవు పలికారు.

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియాను క్యాచ్‌ల సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టులోనూ భారత ఆటగాళ్లు హెన్రీ నికోల్స్ (175), డారిల్ మిచెల్ క్యాచ్‌లను వదిలేయడం జట్టుపై ప్రతికూల ప్రభావం చూపింది. తాజాగా క్రైస్ట్‌చర్చ్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లోనూ పలు సులువైన క్యాచ్‌లను చేజార్చడంతో కివీస్ 356 పరుగులు చేయగలిగింది. మరోవైపు స్పిన్ కోచ్ సాయిరాజ్ బహుతులే మీడియా సమావేశంలో జట్టు ఫీల్డింగ్‌ను సమర్థించుకున్నారు. ప్రాక్టీస్ సెషన్లలో క్యాచ్‌ల విషయంలో కఠోరంగా శ్రమిస్తున్నామని, మ్యాచ్‌లోనూ అదే స్థాయిలో రాణించాల్సి ఉందని అన్నారు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో ఆకాశ్ దీప్ ఐదు వికెట్లు తీసినా, ఆ తర్వాత బ్యాటింగ్‌లో తడబడిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసి కష్టాల్లో నిలిచింది.





సీత పాత్రతో నాలో వ్యక్తిగత మార్పులు

'రామాయణ' నా జీవితంలో ముఖ్యమైన ప్రయాణం: సాయిపల్లవి

హైదరాబాద్, నవంబర్ 28 (సమయం న్యూస్): దర్శకుడు నితీశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణ' చిత్రంలో సీత పాత్ర పోషించడం తన జీవితంలో అత్యంత ముఖ్యమైన ప్రయాణమని ప్రముఖ నటి సాయిపల్లవి అన్నారు. ఆ పాత్ర చేసిన తర్వాత తనలో వ్యక్తిగతంగా కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. 'వి ది ఉమెన్' కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ బర్ఖా దత్‌తో జరిగిన ముఖాముఖిలో ఆమె ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సీత పాత్ర తన జీవితాన్ని ఎలా ప్రభావితం చేసిందన్న ప్రశ్నపై సాయిపల్లవి స్పందిస్తూ.. "నా జీవితం ఎప్పుడూ ఒక సినిమా నుంచి మరో సినిమాతో ముందుకు సాగుతూనే ఉంటుంది. ప్రతి పాత్ర వల్ల మనం ఏదో ఒకటి నేర్చుకుంటాం. అలాగే సీత పాత్రతో నాలో కొన్ని వ్యక్తిగత మార్పులు వచ్చాయి. వాటిని ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం లేదు. అవి అందరూ అర్థం చేసుకోవాల్సిన విషయాలు కూడా కావు" అని పేర్కొన్నారు. సీత లుక్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలు, విమర్శలపైనా ఆమె నిర్మొహమాటంగా స్పందించారు. "సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో నాకు తెలియదనుకోవద్దు. సీతమ్మ పాత్రపై వచ్చే విమర్శలు నా దృష్టికి వస్తూనే ఉంటాయి. ప్రతి ఒక్కరికీ అభిప్రాయాలు ఉంటాయి. వాటిని అభిప్రాయాలుగానే చూడాలి. వాటిని ఎదుర్కొని మరింత బలంగా మారాలి, ధైర్యాన్ని పెంచుకోవాలి. అప్పుడే ప్రపంచాన్ని ఎదుర్కొని, విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగగలం" అని అన్నారు. కేవలం అందానికే పరిమితమయ్యే పాత్రలు తనకు ఇష్టం ఉండవని, అలాంటి వాటిని ఎంచుకోనని స్పష్టం చేశారు. బాహ్య విమర్శలు అంతరంగాన్ని ప్రభావితం చేయకూడదని, లోపల బలంగా ఉన్నప్పుడే అనవసర శబ్దాలను పక్కనపెట్టి ముందుకు వెళ్లగలమని సాయిపల్లవి తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'పై అర్జున్ పాన్ ఇండియా చిత్రం

పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో కథ

చెన్నై, నవంబర్ 28 (సమయం న్యూస్): ప్రముఖ నటుడు, దర్శకుడు అర్జున్ సర్జా తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'ఆపరేషన్ సిందూర్' స్ఫూర్తితో రూపుదిద్దుకోనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయోధ్యలోని పవిత్ర శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రంలో ఘనంగా నిర్వహించిన పూజా కార్యక్రమంతో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. భారత సినీ చరిత్రలోనే తొలిసారిగా అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్రంలో ప్రారంభోత్సవ పూజ జరుపుకున్న చిత్రంగా ఇది చరిత్ర సృష్టించిందని నిర్మాతలు పేర్కొన్నారు. ప్రెసిడెన్షియల్ మూవీస్ ఇంటర్నేషనల్ పతాకంపై అనూప్ మోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అర్జున్ సర్జా దర్శకత్వం వహిస్తున్నారు. విశ్రాంత భారత సైన్యాధికారి మేజర్ విజయ్ భార్గవ్ ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే అందించారు. అయోధ్యలో జరిగిన పూజా కార్యక్రమానికి అర్జున్ సర్జా తన సతీమణి నివేదిత అర్జున్‌తో కలిసి హాజరయ్యారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విశిష్ట అతిథులు ఈ వేడుకలో పాల్గొని చిత్ర బృందానికి



శుభాకాంక్షలు తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ చుట్టూ చోటుచేసుకున్న పరిణామాల స్ఫూర్తితో సమకాలీన భారత చరిత్రలోని కీలక ఘట్టాన్ని శక్తివంతమైన కథనంతో వెండితెరపైకి తీసుకురానున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి కేవలం వార్తల్లోని ఘటన మాత్రమే కాదని, కోట్లాది మంది భారతీయుల హృదయాల్లో మిగిలిన గాయమని చిత్ర యూనిట్ పేర్కొంది. అత్యంత సున్నితత్వం, నిబద్ధత, జాతీయ బాధ్యతతో ఈ అంశాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపింది. సాధారణ కమర్షియల్ సినిమాల పరిమితులను దాటి, యావత్ దేశానికి అంకితమిచ్చేలా భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూ భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించాలన్నదే దర్శకనిర్మాతల లక్ష్యమని యూనిట్ వర్గాలు వెల్లడించాయి.ప్రధానంగా హిందీ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్టును భాషా, ప్రాంతీయ, సాంస్కృతిక సరిహద్దులను చెరిపేస్తూ మొత్తం తొమ్మిది భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జాతీయ గౌరవం, సమిష్టి జ్ఞాపకాలతో ముడిపడిన ఈ కథ ప్రతి భారతీయుడికి చేరాలన్నదే తమ ఉద్దేశమని నిర్మాతలు తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం టైటిల్‌ను గోప్యంగా ఉంచారు. రానున్న నెలల్లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుండగా, భారత 81వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 2027 ఆగస్టు 15న థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

90 అడుగుల ఎత్తు నుంచి దూకి.. ఏడ్చేశా: రష్మిక

'మైసా' షూటింగ్ భయానక అనుభవాన్ని పంచుకున్న నటి

హైదరాబాద్, నవంబర్ 28 (సమయం న్యూస్) : నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న హైఒల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్రీకరణ సమయంలో తనకు ఎదురైన ఓ భయంకరమైన అనుభవాన్ని ఆమె తాజాగా బయటపెట్టారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రం గోండు తెగల నేపథ్యంలో సాగుతుంది. తన సమాజం కోసం, తన ప్రశ్నలకు సమాధానాల కోసం పోరాడే ధైర్యవంతురాలైన మహిళగా ఇందులో రష్మిక కనిపించనున్నారు. వాస్తవానికి నవంబర్ 27న విడుదల కావాల్సిన ఈ సినిమా కొన్ని కారణాలతో వాయిదా పడింది.ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రష్మిక, 'మైసా' షూటింగ్ నాటి సాహసోపేతమైన ఘటనను గుర్తు చేసుకున్నారు. తనకు ఎత్తు ప్రదేశాలంటే ఎప్పటి నుంచో చాలా భయమని చెప్పారు. అలాంటిది ఈ సినిమా కోసం ఏకంగా 90 అడుగుల ఎత్తు నుంచి దూకినప్పుడు, ఇక తన పని అయిపోయిందేమో అనిపించిందని తెలిపారు. ఆ సమయంలో చుట్టూ అంతా స్లో మోషన్‌లో జరుగుతున్నట్లు అనిపించిందని వివరించారు. ఎలాగోలా సురక్షితంగా కిందకు దిగిన తర్వాత కూడా ఆ షాక్ నుంచి వెంటనే బయటపడలేకపోయానని రష్మిక వెల్లడించారు. భయంతో వణికిపోతూ ఏడ్చానని చెప్పారు. తెరపై పోరాడే మహిళ పాత్రలో కనిపిస్తున్నా, నిజ జీవితంలో అలాంటి రిస్క్ సన్నివేశం చేయడం తనకు పెద్ద సవాల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.





'కాకా' నైజాం హక్కులు ఏషియన్ సొంతం

భారీ స్థాయిలో విడుదలకు ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సన్నాహాలు

హైదరాబాద్, నవంబర్ 28 (సమయం న్యూస్) : మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ మాస్ యాక్షన్ చిత్రం 'కాకా' థియేట్రికల్ బిజినెస్‌లో జోరు చూపుతోంది. ఈ సినిమా నైజాం ఏరియా థియేట్రికల్ హక్కులను ప్రముఖ పంపిణీ సంస్థ ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ (ఏషియన్ సినిమాస్) దక్కించుకుంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం శనివారం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. నైజాం ప్రాంతంలో ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ఏషియన్ సంస్థ సన్నాహాలు చేస్తోంది. నైజాం హక్కుల ప్రకటన పోస్టర్‌తోనే గత కొద్ది రోజులుగా సినిమా వాయిదా పడనుందంటూ సాగుతున్న వదంతులకు మేకర్స్ చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించినట్లే 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. ప్రతి ప్రాంతంలో 'కాకా' ఆధిపత్యం కొనసాగనుందని, మెగాస్టార్ పండుగ సంబరాలను మునుపెన్నడూ లేనంత ఘనంగా జరుపుకుందామని చిత్ర బృందం పేర్కొంది. డిసెంబర్ 1 నుంచి ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనుండగా, త్వరలోనే ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.

గతంలో చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని అందించిన బాబీ కొల్లి, ఈసారి మెగాస్టార్‌ను సరికొత్త మాస్ అవతార్‌లో చూపించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అభిమానుల్లో ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అనస్వర రాజన్, నివేదా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే సమకూర్చారు. భానుఉ నందు మాటలు రాస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ, ఆంటోనీ రూబెన్ ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



ఇడుపు కాయితం నుంచి

తెలంగాణ పల్లె పాట

హైదరాబాద్, నవంబర్ 28 (సమయం న్యూస్) : నటుడు ప్రియదర్శి, నాగదుర్గ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం' నుంచి 'ఉల్లిపూల సీరే గట్టి.. ఉత్తరాది సెరువే దాటి' అంటూ సాగే పాట శనివారం విడుదలైంది. అచ్చమైన తెలంగాణ కుటుంబ నేపథ్యంతో, పల్లెదనపు పరిమళాలు అద్దుకుని వచ్చిన ఈ గీతం సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సంప్రదాయ భావోద్వేగాలతో సాగే ఈ పాట ప్రస్తుతం సోషల్ మీడియాలో అలరిస్తోంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో పూర్తి స్థాయి ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి బన్నీ వాస్ వర్క్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. డిసెంబర్ 11న చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో తాజా పాటతో చిత్ర బృందం ప్రచార జోరును మరింత పెంచింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**